ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
మంగళవారం 30 సెప్టెంబరు 2025



వీఎంఆర్‌డీఏ చైర్మన్ పదవీకాలం పొడిగింపు
» మరో ఏడాది అవకాశం
· 8లో

గడువులోగా ప్రారంభిస్తే పరిశ్రమలకు ప్రోత్సాహకాలు
» 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' సదస్సులో విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

గోవాడపై అనిశ్చితి

షుగర్స్ మహాజన సభ నిర్వహణకు నేటితో ముగియనున్న గడువు

- నోరు మెదపని అధికారులు
- రైతులు, కార్మికులకు రూ.36 కోట్ల మేర బకాయిలు
- నిధుల కోసం ప్రభుత్వానికి ఫ్యాక్టరీ చైర్మన్ ప్రతిపాదనలు
- చెరకుర క్రషింగ్‌పై ఇంతవరకు రాని స్పష్టత
- దిక్కుతోచని స్థితిలో రైతులు, కార్మికులు నిర్ణయం



గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ప్రాంగణం

చోడవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

చెరకు రైతులు, షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు ఊహించినట్టుగానే గోవాడ షుగర్స్ మహాజన సభను అధికారులు నిరవధికంగా వాయిదా వేశారు. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరులోగా మహాసభను నిర్వహించాలి. మంగళవారంతో గడువు ముస్తున్నది. మహాజన సభ ఏర్పాటుపై అధికారులు ఇంతవరకు ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో నిరవధికంగా వాయిదాపడినట్టయ్యింది. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో మహాజన సభ ఇక లేనట్టే అన్నది స్పష్టంగా తేలిపోయింది.

రాష్ట్రంలో సహకార రంగంలో నడుస్తున్న ఏకైక షుగర్ ఫ్యాక్టరీ గోవాడ మాత్రమే. సవాలక్ష కారణాలతో ఈ ఫ్యాక్టరీని కూడా చరిత్ర పుటల్లోకి చేర్చేస్తున్నారు. ఒకప్పుడు సహకార రంగంలో అగ్రగామిగా వున్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి సుమారు పదేళ్ల నుంచి కష్టాలు మొదలయ్యాయి. ఇక్కడ పంచదార ఉత్పత్తి వ్యయంతో పోలిస్తే మార్కెట్‌లో ధర తక్కువ వుండడంతో క్రమేపీ నష్టాలు పెరిగిపోయాయి. మరోవైపు ఫ్యాక్టరీ చెల్లించే మద్దతు ధర గిట్టుబాటు కాకపోవడంతో రైతులు చెరకు సాగును తగ్గించడంతో క్రషింగ్ లక్ష్యం ఏటేటా తగ్గిపోతున్నది. 2023-24, 2024-25 సీజన్‌లలో ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసిన రైతులకు రవాణా చార్జీలతో కలిసి సుమారు రూ.29 కోట్లు చెల్లించాల్సి వుంది. కార్మికులకు ఐదు నెలల వేతన బకాయిలు, పదవీ విరమణ చేసిన సిబ్బందికి గ్రాట్యుటీ, ఇతరత్రా కలిపి రూ.7 కోట్ల వరకు అందాల్సి వుంది. ఫ్యాక్టరీకి వివిధ రకాల వస్తువులు, రసాయనాలు సరఫరాచేసిన వారికి రూ.3 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో వున్నాయి. అన్నీ కలిపి రూ.40 కోట్ల మేర బకాయిలు వున్నాయి. ఫ్యాక్టరీ గోదాముల్లో 50 వేల క్వింటాళ్ల పంచదార, మొలాసిస్ ఉన్నాయి. వీటిని విక్రయిస్తే రూ.10 కోట్లకు మించే వచ్చే పరిస్థితి లేదు. అయినా సరే బకాయిలు తీర్చాలంటే ఇంకా రూ.30 కోట్లు అవసరం. మరోవైపు ఫ్యాక్టరీ నిర్వహణ కోసం గతంలో ఆప్కాబ్ నుంచి తీసుకున్న రుణాలు, వాటికి వడ్డీలు కలిపి రూ.50-55 కోట్ల వరకు వుంటాయని ఫ్యాక్టరీ అధికార వర్గాల అంచనా. చెరకు రైతులు, ఫ్యాక్టరీ కార్మికులకు బకాయిల చెల్లింపు కోసం నిధులు విడుదల చేయాలని ఫ్యాక్టరీ చైర్మన్ హోదాలో కలెక్టర్ విజయకృష్ణన్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. చెరకు రైతుల బకాయిల వరకు నిధులు విడుదల చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే ఎప్పుడు వస్తాయనేది స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. నిధుల మంజూరుకు సంబంధించిన ఫైలు ఇంకా అమరావతిలోనే ఉండడం, షుగర్ ఫ్యాక్టరీని నడపడంపై ఉన్నతస్థాయిలో చర్చలు ఒక కొలిక్కి రాకపోవడంతో మహాజన సభను ఇప్పట్లో నిర్వహించకూడదని అధికారులు ఒక నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఇథనాల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని అధికార కూటమికి చెందిన ప్రజాప్రతినిధులు గతంలో పలుమార్లు ప్రకటించడంతో షుగర్ ఫ్యాక్టరీ భవిష్యత్తు ఏమిటన్నదానిపై త్వరలోనే ఒక స్పష్టత వస్తుందని భావించారు. సెప్టెంబరులో నిర్వహించే మహాజన సభలో ప్రకటన వెలువడుతుందని ఊహించారు. కానీ మహాజన సభను నిర్వహించే పరిస్థితులు కానరావడంలేదు. మహాజన సభ నిర్వహిస్తారని, ఫ్యాక్టరీ భవితవ్యంతోపాటు, తమ బకాయిల గురించి చర్చించేందుకు అవకాశం ఉంటుందని భావించిన రైతులు, కార్మికులు నిరాశ చెందుతున్నారు. మరోవైపు ఫ్యాక్టరీ పరిధిలోని చెరకు, పొరుగు జిల్లాలోని ప్రైవేటు ఫ్యాక్టరీకి తరలింపుపై అధికారులు ఇప్పటికే చర్చలు జరిపారు. ఇటు చూస్తూ మహాజన సభ జరిగే పరిస్థితి లేదు. దీంతో ఈ సీజన్‌లో చెరకు క్రషింగ్ లేనట్టేనని రైతులు, కార్మికులు భావిస్తున్నారు.

నీట మునిగి ఇద్దరి మృతి

- రొంగలిపేటలో కలువ పువ్వు కోసం చెరువులో దిగి ప్రాణాలు కోల్పోయిన విద్యార్థి
- బి.కింతాడలో శారదా నదిలో పడి ఫిట్స్ బాధితుడు మృత్యువాత



పెనగంటి మోహన రావు (ఫైల్ ఫొటో)



భరణికాన అప్పల రాజు (ఫైల్ ఫొటో)

దేవరాపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని వేర్వేరు ప్రదేశాల్లో సోమవారం నీట మునిగి ఇద్దరు మృతి చెందారు. వీరిలో ఒకరు పదో తరగతి చదువుతున్న విద్యార్థి వున్నారు. ఈ సంఘటనలకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.

మండలంలోని తెనుగుపూడి శివారు రొంగలిపేటకు చెందిన పెనగంటి మోహన్‌రావు దేవరాపల్లిలోని ఒక ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం స్నేహితుడు రొంగలి హేమంత్‌తో కలిసి సమీపంలోని రాజ చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లారు. అనంతరం మోహన రావు చెరువులో కలువ పువ్వును తీయడానికి నీటిలోకి దిగాడు. అక్కడ లోతు ఎక్కువగా వుండడంతో నీటిలో మునిగిపోయాడు. హేమంత్‌కు ఈత రాకపోవడంతో బిగ్గరగా కేకలు వేశాడు. సమీపంలో ఉన్నవారు వచ్చి చెరువులో దూకి మోహనరావు కోసం గాలించారు. కొద్దిసేపటి తరువాత బయటకు తీశారు. 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు దేవి, వెంకటరమణ

... మిగతా 8వ పేజీలో

ఆరు వరుసలుగా హైవే

అనకాపల్లి నుంచి తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరువు వరకు..

- జిల్లాలో 68.64 కిలోమీటర్ల పొడవు
- నాలుగుచోట్ల నదులపై వంతెనలు, మూడుచోట్ల ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, మూడు చోట్ల రైల్-కమ్-రోడ్డు వంతెనలు
- ప్రభుత్వానికి డీపీఆర్ సమర్పించిన ఎన్‌హెచ్‌ఏఐ ఇంజనీర్లు



ఆరు వరుసలకు విస్తరించనున్న 16వ నంబరు జాతీయ రహదారి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 16వ నంబరు జాతీయ రహదారి విస్తరణకు మార్గం సుగమం అయ్యింది. ప్రస్తుతం వున్న నాలుగు లేన్ల రోడ్లును ఆరు లేన్లకు అభివృద్ధి చేస్తారు. అనకాపల్లి జలగలమదుం జంక్షన్ నుంచి తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు జంక్షన్ వరకు రహదారిని విస్తరించి అభివృద్ధి చేయడానికి ఎన్‌హెచ్‌ఏఐ ఇంజనీర్లు ప్రభుత్వానికి డీపీఆర్ సమర్పించారు. ఆమోదం లభించిన వెంటనే టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి, హైవే విస్తరణ పనులు మొదలుపెడతారు.

రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆప్షన్-4 (టీఓటీ) కింద సుమారు రూ.10,200 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నది. వీటిల్లో అనకాపల్లి నుంచి రాజమహేంద్రవరం వరకు 16వ నంబరు జాతీయ రహదారి కూడా వుంది. సుమారు 160 కిలోమీటర్ల పొడవు వున్న ఈ రోడ్డును ఆరు వరుసలుగా విస్తరించడానికి రూ.3,800 కోట్లు అవసరం అవుతాయని ఎన్‌హెచ్‌ఏఐ ఇంజనీర్లు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రిమండలి ఈ రోడ్డు అభివృద్ధికి ఆమోద ముద్ర వేయడంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు డీపీఆర్‌ను సిద్ధం చేశారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదికను అందజేశారు. జిల్లాలో అనకాపల్లి నుంచి పాయకరావుపేట వరకు 68.64 కిలోమీటర్ల పొడవు వుంది. రహదారి విస్తరణలో భాగంగా జిల్లాలో నాలుగుచోట్ల నదులపై భారీ వంతెనలు, మూడుచోట్ల (అనకాపల్లి పూడిమడక జంక్షన్, తాళ్లపాలెం జంక్షన్, రేగుపాలెం జంక్షన్) ఫ్లై ఓవర్ వంతెనలు, మూడు చోట్ల (బయ్యవరం, రేగుపాలెం, పాయకరావుపేట) రైల్-కమ్-రోడ్డు వంతెనలు నిర్మిస్తారు. ఇంకా 17చోట్ల చిన్నపాటి వంతెనలు, 86 చోట్ల శ్లాబ్ కల్వర్టులు, 76 ప్రదేశాల్లో పైపులైన్ కల్వర్టులు, 18చోట్ల బాక్స్ కల్వర్టులు, 36చోట్ల రిటైనింగ్ వాల్స్, 67చోట్ల కొత్తగా రోడ్డు ఫార్మేషన్ పనులు, 47చోట్ల పాత బాక్స్ కల్వర్టుల పునర్నిర్మాణ పనులు, 22చోట్ల పైపులైన్ కల్వర్టుల పునర్నినిర్మాణ పనులు చేపట్టనున్నట్టు డీపీఆర్‌లో పేర్కొన్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తియితే పారిశ్రామిక, వాణిజ్య పరంగా జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని అధికారులు చెబుతున్నారు.



హోం మంత్రి వంగలపూడి అనిత కాన్వాయ్‌ను అడ్డుకున్న మత్స్యకారులు, మహిళలు

బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు ససేమిరా

హోం మంత్రి అనిత కాన్వాయ్‌ను అడ్డుకున్న మత్స్యకారులు

రాజయ్యపేటలో ఉద్రిక్తత

- స్థానికులు కమిటీగా ఏర్పాటైతే సీఎం, డిప్యూటీ సీఎంల వద్దకు తీసుకువెళతానన్న మంత్రి
- అప్పటివరకూ పనులు ఆపిస్తామని హామీ
- కాన్వాయ్‌కు అడ్డుతొలగిన ఆందోళనకారులు



ఆందోళనకారులతో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తూ అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో సోమవారం హోం మంత్రి వంగలపూడి అనితను మత్స్యకారులు అడ్డుకున్నారు. ఆమె వాహనం ఎదుట రహదారిపై బైఠాయించారు. దీంతో ఈ వ్యవహారంపై స్థానికులతో ఏర్పాటయ్యే కమిటీని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వద్దకు తీసుకువెళతానని, అప్పటివరకూ పనులు నిలుపుచేయిస్తానని ఆమె హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వివరాలిలా ఉన్నాయి.

బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా రాజయ్యపేటలో కొద్దిరోజులుగా మత్స్యకారులు ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారిని కలిసేందుకు సోమవారం సాయంత్రం మంత్రి అనిత గ్రామానికి వెళ్లారు. నిరసన శిబిరం వద్ద బల్క్ డ్రగ్ పార్కు వల్ల కలిగే నష్టాలను ఆమెకు పలువురు మత్స్యకార నాయకులు వివరించారు. ఇప్పటికే హెటిరో కాలుష్యంతో పరిసర గ్రామాల్లో పిల్లలు, పెద్దలంతా క్యాన్సర్ తదితర ప్రమాదకర వ్యాధుల బారినపడుతున్నారన్నారు. మంత్రిగా చొరవ తీసుకుని బల్క్ డ్రగ్ పార్కును ఆపించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ నియోజకవర్గంలోని మత్స్యకార గ్రామాలన్నీ ఎన్నికల్లో తనకు అండగా నిలిచాయని, తాను కూడా వారికి అండగా నిలుస్తానని ప్రకటించారు. రాజయ్యపేట అంటే తనకు పుట్టినిల్లులాంటిదని, మీ ఇంటి ఆడపడుచునని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు రాజకీయాలకతీతంగా ఒక కమిటీని ఏర్పాటు చేసుకుంటే, త్వరలోనే సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల వద్దకు తీసుకువెళతానని హామీ ఇచ్చారు. అయితే కొందరు మత్స్యకార నాయకులు మాట్లాడుతూ తమకు ఇప్పుడే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశం తన

... మిగతా 8వ పేజీలో

ఓపీగ్గా పడిగాపులు

నర్సీపట్నం ఆస్పత్రిలో రోగుల అవస్థలు

తొలుత 'అభా' కౌంటర్ వద్ద రిజిస్ట్రేషన్

- మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వచ్చిన తరువాతే చీటీ జారీ
- దానిని పట్టుకుని ఓపీ కౌంటర్ వద్ద వెళ్లాలి
- కంప్యూటర్‌లో 'అభా' నంబరు నమోదు చేసి, చీటీ జారీ
- రెండుసార్లు క్యూల్లో నిల్చోవడానికి అర్ధ గంటకుపైగా సమయం
- నీరసించిపోతున్న రోగులు
- ఆస్పత్రి అధికారులపై స్పీకర్ అయ్యన్న ఆగ్రహం
- అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశం



ఎడమ వైపున ఓపీ కౌంటర్లు, కుడి వైపున 'అభా' కౌంటర్ వద్ద బారులు తీరిన రోగులు

నర్సీపట్నం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

ఏరియా ఆస్పత్రిలో ఓపీ చీటి రాయించుకోవడానికి రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అరగంటకు పైగా క్యూలలో నిల్చుంటే తప్ప చీటీ అందే పరిస్థితి లేదు. ఈ విషయం శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి రావడంతో ఆస్పత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేసి, ఓపీ చీటీలు వేగంగా జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య సమస్యలతో ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు కోసం వచ్చే వారు ముందుగా ఓపీ చీటి రాయించుకోవాలి. గతంలో ఓపీ విభాగం కౌంటర్ వద్ద క్యూలో నిలబడితే.. అక్కడ వుండే సిబ్బంది రోగి పేరు, జబ్బు వివరాలు కనుక్కొని, ఏ స్పెషలిస్టును కలవాలో చీటి రాసి ఇచ్చేవారు. అయితే అభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) విధానం అమల్లోకి వచ్చిన తర్వాత ఒక్కో రోగి రెండుసార్లు క్యూలో ఉండాల్సి వస్తున్నది. తొలుత ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్

... మిగతా 8వ పేజీలో

మహిళల ఆరోగ్యానికి పెద్ద పీట

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత వైద్య పరీక్షలు, సేవలు
- ఔషధాలపై జీఎస్టీ ఐదు శాతానికి తగ్గింపు
- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్



వైద్యురాలితో మాట్లాడుతున్న ఎంపీ రమేశ్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం ఆరోగ్యంగా, సంతోషంగా ఉంటుందని, అందువల్ల మహిళల ఆరోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. సోమవారం ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద డీపీసీ ఆవరణలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆరోగ్యసేవలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో పలురకాల వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఆరోగ్యంపై అవగాహన పెంచడం, సమయానుకూలంగా వైద్యసేవలు

... మిగతా 8వ పేజీలో

గరుడ వాహనంపై ఊరేగిన దేవదేవుడు

- ఉపమాకలో నేత్రపర్వంగా తిరువీధి సేవ



ఉభయ దేవేరులతో స్వామివారు

నక్కపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని ఉపమాక వెంకన్న క్షేత్రంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గరుడ సేవ, వసంతోత్సవం నిర్వహించారు. తొలుత ఆలయంలో ఉభయదేవేరులతో కూడిన స్వామివారికి ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఇత్తడి గరుడ వాహనంపై ఉభయదేవేరులతో స్వామివారిని వుంచి ఆలయంలో గరుడ సేవ నిర్వహించారు. అనంతరం మాడవీధుల్లో స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తిరువీధి సేవలో భాగంగా భక్తులపై వసంతం చల్లారు.

సతకంపట్టు కనకదుర్గమ్మకు ఎంపీ సీఎం రమేశ్ పూజలు



ఎంపీ సీఎం రమేశ్‌ను సత్కరించి జ్ఞాపికను అందిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ సోమవారం స్థానిక సతకంపట్టు ఆలయంలో కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు.. ఎంపీని సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులు పంపిణీ చేస్తున్న ఆడారి ఆనంద కుమార్

అచ్యుతాపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతి విద్యాసంస్థల ప్రాంగణంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 500 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్, జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాజాన సన్యాసినాయుడు, నాయకులు గొంతిన భక్త సాయిరాం, అగ్గాల హనుమంతరావు, జేవీఎస్ రాజు, కూండ్రపు నాయుడు బాబు, ఇబ్రహీం బాషా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్ని విధాలా సహకారం : దేశంశెట్టి



వెంకటరమణను సన్మానిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని దుప్పితూరు పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి దేశంశెట్టి వెంకటరమణ అన్నారు. సోమవారం జరిగిన మహాజన సభలో ఆయన మాట్లాడుతూ సంఘంలో ఇప్పటివరకు రూ.8.35 లక్షల డిపాజిట్లు ఉన్నాయన్నారు. ఈసందర్భంగా నూతనంగా నియమితులైన వెంకటరమణను సన్మానించారు. ఈకార్యక్రమంలో జూనియర్ నాగేశ్వరరావు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి వెండి పట్టీల వేలం



వెండి పట్టీలు దక్కించుకున్న శ్రీనును సన్మానించిన దృశ్యం

ఎస్.రాయవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురంలో నూకాంబిక ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి సోమవారం గ్రామానికి చెందిన దమ్ము రాజు, జ్యోతి దంపతులు 12 తులాల వెండి పట్టీలను వితరణగా అందజేశారు. కమిటీ సభ్యులు ఈ పట్టీలకు పెద్దల సమక్షంలో వేలం పాట నిర్వహించారు. పోటాపోటీగా సాగిన వేలం పాటలో అడ్డరోడ్డు శివారులోని కుమార్ దాబా యజమాని యడల శ్రీను రూ.80 వేలకు పట్టీలను దక్కించుకున్నారు. అనంతరం గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు వెండి పట్టీలను శ్రీనుకు అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ బుధవారం నిర్వహించనున్న అన్నసమారాధనను వేలంలో పట్టీలు సొంతం చేసుకున్న శ్రీను, లక్ష్మి దంపతుల పేరుతో నిర్వహిస్తామన్నారు.

వాడవాడలా సరస్వతీదేవి పూజలు

ఎలమంచిలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ, మండలంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలు, ఆలయాల్లో సోమవారం సరస్వతీదేవీ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కొత్తపేట సీతారాముల ఆలయం, గాంధీనగర్, కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం, దిమిలి రోడ్డు జంక్షన్, కొక్కిరాపల్లి, పెదపల్లి, సోమలింగపాలెం వార్డులతో పాటు మండలంలోని ఏటికొప్పాక, పీఎస్ఆర్‌పేట, పులపర్తి, పురుషోత్తపురం, తదితర గ్రామాల్లోని అమ్మవారి మండపాల్లో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యార్థులతో వేద పండితులు సరస్వతీదేవి పూజను చేయించారు.

దుర్గాదేవిని దర్శించుకున్న ఆనంద్



అమ్మవారిని దర్శించుకున్న ఆడారి ఆనంద్ కుమార్

ఎలమంచిలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని దిమిలి రోడ్డులో ఏర్పాటు చేసిన దుర్గామాతను సోమవారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడారి ఆనంద్ కుమార్ దర్శించుకున్నారు. కమిటీ ప్రతినిధులు ఆనంద్‌కు ఘన స్వాగతం పలికి మండపంలో పురోహితుల సమక్షంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కమిటీ ప్రతినిధులు, బీజేపీ నేతలు ఆడారి శ్రీధర్, మళ్ల కొండబాబు పాల్గొన్నారు.

'వైసీపీ కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్'

పాయకరావుపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అన్యాయానికి గురవుతున్న వైసీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్ అండగా ఉంటుందని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు అన్నారు. సోమవారం స్థానిక వై జంక్షన్ వద్ద పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్ వాల్ పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిజిటల్ బుక్‌ని మాజీసీఎం వైఎస్.జగన్ ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, వైసీపీ మండల అధ్యక్షుడు గెడ్డమూరి శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబి, పార్టీ నాయకులు ధనిశెట్టి బాబూరావు, ఇసరపు తాతారావు, జగతా శ్రీను, పన్నీరు పాపారావు, కోడా కోటేశ్వరరావు, మేడిశెట్టి రామగోవిందు పాల్గొన్నారు.

మునగపాకలో..

వైసీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ భరోసాగా నిలుస్తుందని ఆ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ శ్రేణులకు రక్షణగా పార్టీ అధినేత వైఎస్.జగన్ డిజిటల్ బుక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు, వైసీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సరస్వతీదేవిగా వరమహాలక్ష్మి

పాయకరావుపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిట్టూరి మెట్రోలోని వైకుంఠనారాయణ సమేత వరహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



వీణాపాణిగా దుర్గాదేవి

అచ్యుతాపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం దుర్గాదేవి అమ్మవారు సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని దోసూరులో దుర్గాదేవిని సరస్వతిదేవిగా అలంకరణ చేసి సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు. జంగులురులో అమ్మవారికి సారె ఊరేగింపు చేశారు.



చదువుల తల్లిగా కన్యకాపరమేశ్వరి

ఎలమంచిలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చదువుల తల్లికి 80 మంది విద్యార్థులు ఎలమంచిలి బుక్స్ అండ్ స్టేషనరీ అసోసియేషన్ ప్రతినిధులు ఇచ్చిన పూజా సామగ్రితో పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి బంగారు కాసులను సమర్పించారు.

జీఎస్‌టీ కరపత్రాలు ఆవిష్కరించిన మంత్రి అనిత

నక్కపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్‌టీ-సూపర్ సేవింగ్స్ కరపత్రాలను సోమవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత ఆవిష్కరించారు. జీఎస్‌టీని కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం తగ్గించడం వల్ల ప్రజల కొనుగోలు శక్తి, జీవన ప్రమాణాలు పెరుగుతాయని, ముఖ్యంగా పొదుపు చేసుకునే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, టీడీపీ నాయకులు వినోద్‌రాజు, కొప్పిశెట్టి వెంకటేశ్, కురందాసు నూకరాజు, గింజాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలపై జీఎస్‌టీ తగ్గింపు

జీఎస్‌టీ సంస్కరణల్లో భాగంగా అన్నదాతలకు ఆనందకరంగా మారుతాయని ఏవో ఉమా ప్రసాద్ చెప్పారు. సోమవారం మండలంలోని ఉద్దండపురం గ్రామంలో రైతులకు వ్యవసాయ పరికరాల ఉత్పాదకాలపై జీఎస్‌టీ తగ్గింపు గురించి అవగాహన కల్పించారు. వ్యవసాయ రంగానికి సంబంధించి వ్యవసాయరంగ ఉత్పాదకలు, యాంత్రీకరణ పరికరాలు, సూక్ష్మ సేద్య పరికరాలపై జీఎస్‌టీ 18 శాతం నుంచి 5 శాతం తగ్గిందన్నారు. ఈ మేరకు సవరించిన రేట్లు వెంటనే అమలులోకి వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ రైతులు ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.



సూపర్ జీఎస్‌టీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న హోం మంత్రి అనిత

పాయకరావుపేటలో..

జీఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రతి నెల ప్రజలకు ఎంతో ఆదా అవుతుందని రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియంకేరి అన్నారు. సోమవారం ఎంపీడీఓ విజయలక్ష్మి, తహశీల్దారు ఎస్‌ఏ.మహేష్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కాలనీలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ఉద్యోగులు నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యావసర సరుకుల నెలవారీ ఖర్చు గణనీయంగా తగ్గిందన్నారు. మందులు, వివిధ సేవలపై కూడా జీఎస్టీ తగ్గడం వలన ప్రతి కుటుంబానికి ప్రతి నెలా ఖర్చులు తగ్గి డబ్బు ఆదా అవుతుందన్నారు. టీడీపీ నాయకుడు బోడపాటి శ్రీను, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సూపర్ జీఎస్టీపై ప్రచారం చేస్తున్న రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియంకేరి, ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు

భూదేవిగా మెప్పించిన సంజన ప్రియాసిని

తిరుమల శ్రీవారి గజవాహనం తిరువీధి ఉత్సవంలో ప్రదర్శన

పాయకరావుపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఇంటర్ విద్యార్థిని నారపురెడ్డి సంజన ప్రియాసిని పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరుస్తోంది. స్థానిక జనసేన పార్టీ నాయకురాలు నారపురెడ్డి పద్మావతి కుమార్తె సంజన ప్రియాసిని ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ప్రస్తుతం తిరుమల బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటున్న సంజన ప్రియాసిని సోమవారం జరిగిన గజవాహనం తిరువీధి ఉత్సవంలో ప్రదర్శించిన వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి అవతారాల వేషధారణలో భూదేవి వేషధారిణిగా చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈమె గతంలో తిరుమల బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే కోలాటం బృందంలో సభ్యురాలిగా కళానైపుణ్యాన్ని ప్రదర్శించింది. ఈమె దాస సాహిత్య ప్రాజెక్ట్ నిర్వాహకులు శర్మ, శిరీష ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొంది.



తిరుమల బ్రహ్మోత్సవాల్లో భూదేవి వేషంలో ఉన్న నారపురెడ్డి సంజన ప్రియాసిని

తక్కువ వడ్డీకే రైతులకు రుణాలు

శ్రీరాంపురం సొసైటీ పర్సన్‌ఇన్‌చార్జి చిక్కాల శ్రీనివాసరావు

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు తక్కువ వడ్డీకే రుణాలను మంజూరు చేస్తామని శ్రీరాంపురం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి చిక్కాల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జరిగిన సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకుల మాదిరిగానే సొసైటీ ద్వారా రైతులకు కావలసిన అన్ని రకాల రుణాలను మంజూరు చేస్తామన్నారు. సొసైటీ అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. అనంతరం రైతులకు రుణాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్, సొసైటీ డైరెక్టరు పల్లెల సత్యనారాయణ, బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జి చిక్కాల శ్రీనివాసరావు

డి పట్టా భూములను ఆన్‌లైన్ చేయాలంటూ దళితుల ధర్నా

ఎస్.రాయవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు సచివాలయం వద్ద డి పట్టా భూములను ఆన్‌లైన్ చేయాలంటూ దళితులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎం. సత్యనారాయణ మాట్లాడుతూ 2005లో దళితులకు ఇచ్చిన డి పట్టా భూములను ఆన్‌లైన్ చేయకపోవడంతో నష్టపోతున్నారని తెలిపారు. గ్రామానికి చెందిన అగ్ర వర్ణాల వారికి రెవెన్యూ అధికారులు కొమ్ము కాస్తూ దళితుల డి పట్టా భూములను ఆన్‌లైన్ కాకుండా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి స్థానిక రెవెన్యూ అధికారిపై చర్యలు తీసుకొని డి పట్టా భూములను వెంటనే ఆన్‌లైన్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లి లక్ష్మి, పిల్లి రాజులమ్మ, పులగల తలుపులు, దిర్సాల కృష్ణంరాజు పాల్గొన్నారు.



పెదగుమ్ములూరు సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితులు

దుర్గానగర్‌లో ఘనంగా బోనాల ఊరేగింపు

పాయకరావుపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక దుర్గానగర్‌లో తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మల్లపురెడ్డి రమాకుమారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహిళలు బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద ఏర్పాటుచేసిన మండపంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని సోమవారం సరస్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలను దుర్గానగర్, దుర్గాకాలనీ తదితర ప్రాంతాల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియంకేరి, నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, పెదిరెడ్డి శ్రీను, మజ్జూరి నారాయణరావు, జూరెడ్డి ప్రసాద్, కొండబాబు, వేములపూడి అప్పారావు, బోడపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళా భక్తులు

'క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం'

ఎలమంచిలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రీడారంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను క్రీడాకారులు అందిపుచ్చుకోవాలని జనసేన పార్టీ నేతలు ఊటకూటి రమేష్, కొఠారు శ్రీను అన్నారు. పట్టణంలోని రాజీవ్ గాంధీ క్రీడామైదానంలో జరుగుతున్న హాకీ టోర్నీ 2వ రోజు క్రీడాకారులతో కలిసి ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాకీ క్రీడాకారులు సీనియర్ క్రీడాకారుల నుంచి మెలకువలు అందిపుచ్చుకోవాలన్నారు. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులంతా స్నేహపూర్వక వాతావరణంలో తమ ప్రతిభను ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనరు కె.నరేష్, ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు జీవీ రెడ్డి, డి.మహేష్, జి. రాంబాబు, దుర్గారావు పాల్గొన్నారు.



హాకీ క్రీడాకారులతో మాట్లాడుతున్న జనసేన నేతలు ఊటకూటి రమేష్, కొఠారు శ్రీను

తిమ్మరాజుపేటలో సందడిగా సారె సంబరం



దుర్గాదేవిని దర్శించుకున్న జనసేన నేత సుందరపు సతీష్‌కుమార్

మునగపాక, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో తిమ్మరాజుపేటలో దుర్గాదేవి శరన్నవరాత్రి వేడుకలో భాగంగా నిర్వహించిన సారె సంబరం అబ్బురపరచింది. ఈ వేడుకకు జనసేన ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల ముఖ్య ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేడుకలో కూటమి నాయకులు భీమరశెట్టి శ్రీను, ఆడారి మంజు, దాడి మునిలినాయుడు, దొడ్డి శ్రీను, టిక్కలి పరశురాం, బీవీ.రమణ, ఆడారి గణేశ్ పాల్గొన్నారు.

నేడు మునగపాక పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

మునగపాక, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీన జరుగుతుందని సొసైటీ చైర్‌పర్సన్ విల్లూరి నూకనర్సింగరావు, సీఈవో పెంటకోట వెంకటమహేశ్వరరావు తెలిపారు. ఆర్థిక సంవత్సరం వార్షిక నివేదిక, జమా ఖర్చులు, అంచనా బడ్జెట్ ఆమోదం, వంటి అంశాలు చర్చకు వస్తాయని తెలిపారు.

బొడ్డేడను కలిసిన పెట్ల గణేశ్

మునగపాక, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన బొడ్డేడ ప్రసాద్‌ను నర్సీపట్నం మాజీఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ శాలువతో సోమవారం సత్కరించారు. స్థానిక ప్రసాద్ క్యాంపు కార్యాలయానికి వచ్చి అభినందనలు తెలిపారు. ప్రసాద్‌ను అభినందించేందుకు వైసీపీ నాయకులు తరలివచ్చారు.

ఘనంగా దుర్గాదేవి ఘటాల ఊరేగింపు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడిలో సోమవారం దుర్గాదేవి ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు ఘటాలను నెత్తిన ఎత్తుకొని అమ్మవారి చిత్రపటంతో ఊరేగింపుగా వెళ్లి దుర్గాదేవి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి బాబి దంపతులు, గురుభవానీలు పొట్టి శ్రీనివాసరావు, భీముని శివాజీ, గ్రామ పెద్దలు పోలిశెట్టి పెదఈశ్వరరావు, గ్రామ ఉప సర్పంచ్ పోలిశెట్టి శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

సరస్వతీదేవికి పూజలు

మునగపాక, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు మండపాల వద్ద పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. స్థానిక జెడ్పీ స్కూల్లో సరస్వతీదేవి విగ్రహానికి భవానీలు పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరామారావు, ఆడారి శ్రీకాంత్, పెంటకోట అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి నాటికి
పేదలకు పక్కా గృహాలు

▸▸ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా


సమావేశంలో మాట్లాడుతున్న పీలా గోవిందా

తుమ్మపాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి నాటికి పేదలకు పక్కా గృహాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని మాజీ ఎమ్మెల్యే, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. తుమ్మపాలలో సోమవారం జరిగిన టీడీపీ మండల నాయకుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల లక్ష్యంగా పేర్కొన్నారు. త్వరలో పేదలకు స్థలాలు అందించనున్నామని చెప్పారు. అనంతరం సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ అంశంపై అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గింపు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి, నాయకులు నంబారు శ్రీనివాసరావు, ఆడారి గోవిందరావు, తలారి కాశినాయుడు, బత్తుల రమేష్, మెయ్యా నూకరాజు, చెక్కల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'అనుమతులు లేకుండా బాణసంచా తయారీ నేరం'


బాణసంచా తయారీ అనుమతులపై ఆరా తీస్తున్న అధికారులు

సబ్బవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని తహశీల్దార్ బి.చిన్నికృష్ణ హెచ్చరించారు. మండలంలోని గుల్లేపల్లి, మలునాయుడుపాలెం, గంగవరం గ్రామాల్లో సోమవారం సీఐ జి.రామచంద్రరావు, జిల్లా సహాయ కార్మిక అధికారి పి. సూర్యనారాయణతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా తయారీ కేంద్రాల వద్ద నిబంధనలు విధిగా పాటించాలన్నారు. పరిమితి మించి సామగ్రి నిలువ చేసినా చర్యలు చేపడతామని హెచ్చరించారు. సహాయ కార్మిక అధికారి సూర్యనారాయణ మాట్లాడుతూ బాలలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బి.చైతన్య, వీఆర్వో బి.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తదితరులు

పరవాడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ కార్యకర్తల కోసం పార్టీ అధిష్ఠానం రూపొందించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను సోమవారం ఇక్కడ మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి గుర్తించి వారికి మనోధైర్యం కల్పించేందుకు డిజిటల్ బుక్‌ను రూపొందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, వెన్నెల అప్పారావు, పెదిశెట్టి శేఖర్, బొద్దపు చిన్నారావు, కావలి అప్పలరాజు, పల్లా గోవింద్, సూరాడ మసేను తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు అండగా జాగృతి సంస్థ'

సబ్బవరం, సెపెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతులకు జాగృతి సంస్థ అండగా నిలుస్తుందని ఆ సంస్థ ఎండీ కందర్ప సుజాత అన్నారు. సోమవారం ఇక్కడ జరిగిన అమృతఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఎనిమిదో ప్రాతినిధ్య మహాజన సభలో ఆమె మాట్లాడారు. అమృతఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సాధించిన విజయాలను వివరించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా పొట్నూరి అప్పారావు, ఉపాధ్యక్షుడిగా మజ్జి అప్పలరాయుడు, డైరెక్టర్లుగా రేసుపూడి రమణ, వెన్నల అప్పలనాయుడు, గంద్రెడ్డి అప్పారావు, సాలాపు సత్యారావు, సీహెచ్.రేవతి, ఎం.మమత, ఎస్.రమణమ్మ, బి.సూరీడమ్మ ఎన్నికయ్యారు. జాగృతి సీఈవో మౌక్తిక, పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను ఆదుకోవాలని జడ్సీకి వినతి


జడ్సీకి వినతి పత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో చిరు వ్యాపారులను ఆదుకోవాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందస్తు సమాచారం లేకుండా తోపుడు బండ్లు, బడ్డీలను తొలగిస్తుండడం వల్ల ఆయా వ్యాపారులు జీవనోపాధి కోల్పోయారని ఆరోపించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా అయినట్లయితే ప్రధాన రహదారులపై ఉన్న వర్తక, వాణిజ్య షాపుల సెల్లార్లను పార్కింగ్‌కి అందుబాటులోకి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జోనల్ కమిషనర్ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, నాయకులు కొణతాల మురళీకృష్ణ, కె.ఎం.నాయుడు, జాజుల రమేష్, కోరుకొండ రాఘవ, వేగి త్రినాథ్, గైపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అన్నసమారాధనలు

పరవాడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ బొంకుల దిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. తొలుత ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులు ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ప్రసాదాలను స్వీకరించారు. అంతకుముందు ఎంపీపీ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచులు పైలా అప్పా రావు, చుక్క రామునాయుడు, టీవీ అప్పారావు, రెడ్డి శ్రీనివాసరావు, పైలా అప్పలనాయుడు, పైలా పోతునాయుడు, బొంకులదిబ్బ యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే, తానాంలో ఆదర్శ మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద అన్నసమారాధనను ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ ప్రారంభించారు. నాయకులు రొంగలి గోపాలకృష్ణ, పైలా కృష్ణారావు, పైలా మధుబాబు, గొరుపూటి సింహాచలం నాయుడు, ముత్యాలనాయుడు, పైలా అప్పారావు, రొంగలి అప్పారావు, పర్రి వెంకటరమణ, ఆదర్శ మోటార్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కూండ్రపు పరమేష్, బి.విశ్వేశ్వరరావు, రమణ, అచ్చింనాయుడు పాల్గొన్నారు.


కొత్తూరులో కనకదుర్గమ్మను దర్శించుకుంటున్న పీలా గోవింద, బత్తుల


కామాక్షిదేవీ అమ్మవారికి సారెను ఊరేగిస్తున్న భక్తులు

సరస్వతీ నమస్తుభ్యం..

▸▸ వాడవాడలా అత్యంత వైభవోపేతంగా దుర్గా నవరాత్రి ఉత్సవాలు ▸▸ వివిధ రూపాల్లో ఆదిమాతను అలంకరించి విశేష పూజలు

అనకాపల్లి టౌన్/కొత్తూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా అత్యంత ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారు సోమవారం వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఇక్కడి నూకాంబిక ఆలయంలో కుంకుమ పూజలు, ఉత్సవమూర్తికి అభిషేకాలు జరిపారు. ఆలయ ఈవో కె.ఎల్.సుధారాణి, మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, మాజీ ధర్మకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సతకంపట్టులోని కనకదుర్గమ్మ, నిదానందొడ్డిలోని కామాక్షిదేవి సరస్వతిదేవి అలంకరణలో, కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్ధినిగా, గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో గౌరీమాత భద్రకాళీగా దర్శనమిచ్చారు. నిదానందొడ్డిలో కర్రి రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. మహాశివునికి రుద్రాభిషేకం, నవదుర్గ హోమం నిర్వహించారు. కోట్నివీధిలోని అమ్మవారిని వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, తదితరులు దర్శించుకున్నారు. ఇదిలావుంటే, గవరపాలెంలోని దిబ్బవీధి మళ్లవారి దొడ్డిలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ మండపం నుంచి భవానీ భక్తులు సోమవారం సాయంత్రం ఘటాలతో ఊరేగింపు జరిపారు. సతకంపట్టులోని కనకదుర్గమ్మ ఆలయానికి వెళ్లి సమ


సరస్వతీదేవి అలంకరణలో సతకంపట్టు కనకదుర్గమ్మ

ర్పించారు. ఈ కార్య క్రమంలో గురు భవానీ రాపేటి శ్రీనివాసరావు, యల్లపు సత్యనారాయణ, దాడి భాస్కరరావు, కాండ్రేగుల పోతురాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, కొత్తూరు కాలేజీ జంక్షన్ వద్ద గల దుర్గామాతను మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. కూటమి నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, బర్ల నాగరాజు, కోన శ్రీను, గైపూరి చిరంజీవి, పేరపు రాంబాబు, మద్దాల నారాయణరావు, కుమార్ రాజా, ఈశ్వరరావు, మొల్లి నాగు తదితరులు పాల్గొన్నారు. సత్యనారాయణపురంలో కల్యాణగిరిపై కొలువుదీరిన కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. సోమవారం సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నా కర్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు.

లంకెలపాలెం : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు సోమవారం పలుచోట్ల సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెదముషిడివాడ, గండివానిపాలెం, సాలాపువానిపాలెం, మంత్రిపాలెం, కన్నూరులలో మండపాల వద్ద సరస్వతీదేవికి పూజలు నిర్వహించారు. స్థానిక నాయకులు కరణం నరసింగరావు, బొండా అచ్చిబాబు, బలిరెడ్డి అప్పారావు, దేముడు, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్నివర్గాలకు మేలు

▸▸ అవగాహన కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్సీ చక్రవర్తి, జీఎస్టీ అధికారులు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అన్ని నిత్యావసరాలపై జీఎస్టీ తగ్గించడంతో ప్రతి కుటుంబానికి రూ.వెయ్యి వరకు ఆదా అవుతుందని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి అన్నారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై సోమవారం ఉడ్‌పేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ దుకాణదారుడైనా పాత ధరలతో వస్తువులను విక్రయిస్తే వెంటనే వాణిజ్యపన్నుల శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. జీఎస్టీ అధికారులు మాట్లాడుతూ వ్యాపారులంతా కేంద్రం నిబంధనలకు అనుగుణంగా సరకుల విక్రయాలు చేపట్టాలన్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వై.సంతోష్‌కుమార్, కమర్షియల్ టాక్స్ అధికారులు, ఆర్‌పీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలావుంటే, జీఎస్టీ సంస్కరణల ఫలితాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ టి.శేషాద్రి, జిల్లా రవాణా శాఖ అధికారి జి.మనోహర్ అన్నారు. సోమవారం సాయంత్రం రింగు రోడ్డులోని ఒక షోరూమ్‌లో ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్లు సీహెచ్.సింధుప్రియ, కృష్ణారావు, ప్రేమ్‌కుమార్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లు, రవాణాశాఖ అధికారులు ఏవీ రమణ, అమృతకుమారి తదితరులు పాల్గొన్నారు.

గుండెను పదిలంగా కాపాడుకోవాలి

▸▸ వైద్యాలయం అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ డీడీ నాయుడు



అవగాహన కార్యక్రమంలోమాట్లాడుతున్న డాక్టర్ డీడీ నాయుడు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మానవ శరీరంలో అతి ముఖ్యమైన అవయవం గుండె అని, దీనిని ప్రతి ఒక్కరూ చక్కగా పరిరక్షించుకోవాలని ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ డీడీ నాయుడు అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా సోమవారం ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో వాకర్స్‌కు ఏర్పాటైన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. గుండె పోటు అనేది అధిక రక్తపోటు వల్ల వస్తుందన్నారు. మధుమేహ వ్యాధి ఉన్నవారికి రక్తంలో మార్పుల వలన గుండె గోడలు మందంగా తయారై రక్త సరఫరాలో ఇబ్బందులు ఏర్పడతాయని వివరించారు. గుండెపోటు వస్తుందని తెలియడానికి సూచనలు శరీరం చెమటలు పట్టడం, గుండె వేగం పెరగడం, నిస్సత్తువ వంటివి వస్తాయన్నారు. ఇటువంటి సమయంలో తొందర పడకుండా రోగికి గాలి బాగా ఆడేటట్లు చేయాలని, తరుచూగా దగ్గుతుండాలని సూచించారు. ఈ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ వైద్యుల సూచనలు, సలహాలు పాటించి గుండె సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వాకర్స్ పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లతో ఇబ్బందులపై రైతుల ఆందోళన


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న తుమ్మపాల రైతులు

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అనధికార లేఅవుట్లతో వర్షపు నీరు నిలిచి, పంటలు పాడవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తుమ్మపాలకు చెందిన పలువురు రైతులు వాపోయారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుమ్మపాల సర్వే నెంబరు 39, 316, 317లలో భూములు గల ఆసామి తన భూమిని అనధికార లేఅవుట్‌గా తయారు చేసి, వర్షపు నీరు శారదా నదిలోకి ప్రవహించకుండా రాతి గోడలు నిర్మించారని ఆరోపించారు. ఈ కారణంగా తమ భూముల్లో నీరు నిలిచిపోయి పంటలు పాడవుతున్నాయన్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వర్షాలు తీవ్రమైతే పంటలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఈ సమస్యపై వెంటనే స్పందించాల్సిందిగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీని సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు బొడ్డపాటి చినరాజారావు, గొంతిన గంగాజలం, ఎస్.రాజు, పీలా బుజ్జి, గంగిరెడ్ల రమణ, బొడ్డపాటి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పనిగంటల పెంపు తీర్మానంపై ధర్నా



కశింకోటలో ధర్నా చేస్తున్న సీఐటీయూ, ఐద్వా నాయకులు

కశింకోట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పని గంటల పెంపు తీర్మానాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా కశింకోటలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రం నీరు గారుస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి మహిళా కార్మికులకు రాత్రిపూట డ్యూటీలు, పని గంటల పెంపు విధానాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి

▸▸ నిబంధనలు పాటించని పలువురికి జరిమానా : సీఐ


హెల్మెట్ ధరించని వారికిజరిమానా విధిస్తున్న పోలీసులు

కశింకోట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సీఐ అల్లు స్వామినాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం బయ్యవరం వద్ద ద్విచక్ర వాహనాలు తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ ధరించని వారికి రూ.1035ల జరిమానా విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నోపార్కింగ్ ప్రదేశంలో వాహనాలు నిలిపినా, రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపినా చర్యలు తప్పవన్నారు. చాలా మంది నిబంధనలు పాటించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు అదుపు చేయాలంటే నిబంధనల మేరకు వాహనాలు నడిపితే చాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

▸▸ కలెక్టర్ విజయకృష్ణన్


సేంద్రియ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ పంటల వినియోగాన్ని అంతా చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. సోమవారం ఇక్కడి కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో సబ్బవరంలో గల అమృత పాల ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఆమె సందర్శించి మాట్లాడారు. పరిమితికి మించి రసాయన ఎరువుల వాడకం, ఆ పంటల వినియోగం వలన ఆరోగ్యం పాడవ్వడమే కాకుండా పర్యావరణం దెబ్బతింటుందన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావును కలెక్టర్ ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుమ్మపాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అల్లిఖానుడుపాలెం సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా మంగళవారం ఆ పరిధిలోని గ్రామాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులంతా సహకరించాల్సిందిగా కోరారు.

'రామచంద్ర'లో రాజా సాబ్ ట్రయిలర్ ప్రదర్శన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన 'రాజా సాబ్' చిత్రం ట్రయిలర్‌ను సోమవారం రాత్రి పట్టణంలోని రామచంద్ర థియేటర్‌లో ప్రదర్శించారు. అనకాపల్లి జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు జీవీఎల్ఎన్ రాజు, పట్టణ అధ్యక్షుడు కాండ్రేగుల జోగేంద్ర, కార్యదర్శి కొణతాల అరవింద్ పర్యవేక్షణలో థియేటర్ అధినేత డీవీవీ గోపాలరాజు చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రభాస్ అభిమానులు, థియేటర్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేత


వీల్‌చైర్ అందజేస్తున్న జనసేన నాయకులు

పరవాడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా వాడచీపురుపల్లి పంచాయతీకి చెందిన దివ్యాంగులకు వీల్‌చైర్లను సమకూర్చింది. జనసేన పార్టీ నాయకులు వెలుగుల అనిల్‌కుమార్ చేతుల మీదుగా సోమవారం వీటిని అందజేశారు. నాయకులు పి.రాజు, కె.రాజేష్, గొరుసు శ్రీనివాసరెడ్డి, బండారు అప్పలనాయుడు, పోలవరపు రవి, పి.పైడిరాజు, కూండ్రపు దేముడు, కూండ్రపు అప్పలనాయుడు, వెలుగుల గణేశ్ పాల్గొన్నారు.

'దుకాణాల తొలగింపు తగదు'

తుమ్మపాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వీధి వ్యాపారులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు సోమవారం కోరారు. ఇటీవల జీవీఎంసీ అధికారులు పట్టణంలో ఫుట్‌పాత్‌లపై ఉన్న వ్యాపారాలను తొలగించడంతో వారంతా రోడ్డున పడ్డారన్నారు. కుటుంబాలను సైతం పోషించుకోవడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం వీధి వ్యాపారులు వ్యాపారాలు నిర్వహణకు ప్రత్యామ్నాయ మార్గాలను చూపాలని కోరారు.

గుండెపోటుతో ఎస్ఐ శ్రీనివాసరావు మృతి

▸▸ ప్రస్తుతం పూసపాటిరేగ పోలీస్ స్టేషన్‌లో విధులు

▸▸ స్వగ్రామం అనకాపల్లి


శ్రీనివాసరావు, ఎస్ఐ (ఫైల్)

పూసపాటిరేగ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో విజయదశమి విధులు నిర్వహించేందుకు వెళ్లిన విజయనగరం జిల్లా పూసపాటిరేగ రెండో ఎస్ఐ శ్రీనివాసరావు తాను విశ్రాంతి తీసుకుంటున్న లాడ్జిలో సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. స్నానపు గదిలో ఉన్నచోటే కూలిపోయారు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈయన కొంతకాలంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో రెండో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. స్వగ్రామం అనకాపల్లి. ఆయనకు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎస్ఐ మృతి వార్త తెలిసి స్థానిక ఎస్ఐ దుర్గాప్రసాద్, స్టేషన్ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఆయన మృత దేహానికి విజయవాడ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామానికి తీసుకెళ్లారని ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

పెదవలసలో డ్రైనేజీ పనులు ప్రారంభం



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ పద్మ తదితరులు

జి.మాడుగుల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంతాల పంచాయతీ పెదవలసలో డ్రైనేజీ పనులను సర్పంచ్ జి.పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రైనేజీ నిర్మాణంతో పారిశుధ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండబాబు, తిరుపతమ్మ, కృష్ణమూర్తినాయుడు, భీమన్న, చిన్న, నూకరాజు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు జాఫ్రా మొక్కల పంపిణీ



రైతులకు జాఫ్రా మొక్కలను పంపిణీ చేస్తున్న సీలేరు సర్పంచ్ దుర్గో

సీలేరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీలేరు పంచాయతీ పరిధిలోని చింతపల్లిక్యాంప్‌లో సోమవారం గిరిజన రైతులకు జాఫ్రా మొక్కలను సర్పంచ్ పి.దుర్గో పంపిణీ చేశారు. ఉపాధి హామీ పథకంలో 19 మంది రైతులకు ఒక్కొక్కరికి 200 మొక్కల చొప్పున 3,800 మొక్కలను అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

వెంకన్నకు వెండి, పంచలోహ ఆభరణాల వితరణ



వేంకటేశ్వరస్వామికి వెండి, పంచలోహాల ఆభరణాలను ఆలయ ధర్మకర్త సుబ్బారావుకు అందిస్తున్న భక్తులు

పాడేరురూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన పద్మావతి సహిత వేంకటేశ్వర స్వామికి సోమవారం వెండి, పంచలోహ ఆభరణాలను భక్తులు ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావుకు అందజేశారు. పట్టణానికి చెందిన సున్నం నానిబాబు హర్షవర్ధిని దంపతులు వెండి విగ్రహం, పంచలోహాల కిరీటం, మహాలక్ష్మిదేవి ప్రతిమలను స్వామి వారికి సమర్పించారు. సత్యవరపు రామచందరరావు, సునీత దంపతులు స్వామి వారి పాదాలు, పంచలోహాల ధర్మపీఠాన్ని అందించారు. ఆ దంపతులను ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు కమిటీ ప్రతినిధులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి రొబ్బి రాము, కోశాధికారి వి.నగేష్, దాము, కార్యదర్శులు వర్మ రాము, సత్తిబాబు, వి.నాగేశ్వరరావు, ఎస్.రాము, నాయుడు, ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ శర్మ పాల్గొన్నారు.

వనభసింగిలో ఘనంగా దుర్గాష్టమి



భక్తులకు ప్రసాదం, అమ్మవారి ఫొటో అందిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనభసింగి పంచాయతీ కేంద్రంలో దుర్గాష్టమి-మహిళా సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా సోమవారం నిర్వహించారు. ఆంధ్ర వనవాసీ కళ్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ముంబాయికి చెందిన అఖిల భారతీయ వనవాసి కల్యాణ ఆశ్రమం ప్రతినిధి అతుల్ జోగ్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సంస్కృతి, సంప్రదాయాలు చాలా బాగున్నాయన్నారు. దేశంలో ఎక్కడా ఇటువంటి సంప్రదాయ పద్ధతులను చూడలేదన్నారు. భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో తమ ఆశ్రమం ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం భక్తులకు ప్రసాదం, మహిళలకు దుర్గాదేవి ఫొటో, పసుపు, కుంకుమ, జాకెట్ పీసులను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వి.లక్ష్మణ్, వనవాసీ ఆశ్రమం ప్రతినిధులు, సభ్యులు ఆదినారాయణ, అచ్చమ్మ, వి.భగత్‌రామ్, బాలకృష్ణ, ఎం.శ్రీను, రాజు, జగన్నాథం, బలోక్ దొర, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సీమకొండ రోడ్డు మరమ్మతు చేయాలని నిరసన



సీమకొండ రోడ్డుపై నిరసన తెలుపుతున్న గిరిజనులు

పెదబయలు, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుల్లేలు పంచాయతీలో శిథిలావస్థకు చేరినా సీమకొండ ప్రధాన రహదారిని తక్షణమే మరమ్మతు చేపట్టాలని పరిసర గ్రామాల గిరిజనులు, జీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రహదారిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. 30 గ్రామాల గిరిజనులకు ఆధారమైన ఈ శిథిలావస్థకు చేరడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ఛిద్రం కావడంతో తమ గ్రామాలలో ఎవరైనా అనారోగ్యాల బారిన పడినప్పుడు అంబులెన్స్ రావటం లేదని, అటువంటి సమయాల్లో డోలీ ద్వారా రోగులకు ఆస్పత్రికి తరలిస్తున్నామని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజుబాబు, చంద్రయ్య, సింహాచలం, నారాయణ, రాజు, జీఎస్‌యూ నాయకులు బాబూజీ, మాదవరావు తదితరలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేత

పరవాడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా వాడచీపురుపల్లి పంచాయతీకి చెందిన దివ్యాంగులకు వీల్‌చైర్లను సమకూర్చింది. జనసేన పార్టీ నాయకులు వెలుగుల అనిల్‌కుమార్ చేతుల మీదుగా సోమవారం వీటిని అందజేశారు. నాయకులు పి.రాజు, కె.రాజేష్, గొరుసు శ్రీనివాసరెడ్డి, బండారు అప్పలనాయుడు, పోలవరపు రవి, పి.పైడిరాజు, కూండ్రపు దేముడు, కూండ్రపు అప్పలనాయుడు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు మేలు

రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్



కాశీపట్నం దుకాణాలకు వెళ్లి జీఎస్టీ గురించి వివరిస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్

అనంతగిరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణ కారణంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో మేలు చేకూరుతున్నదని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలోని సోమవారం ఆయన దుకాణాలకు వెళ్లి జీఎస్టీ సంస్కరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 ద్వారా 375 వస్తువులపై భారీగా తగ్గింపుతో సామాన్యుడు సైతం వస్తువులను కొనుగోలు చేసేందుకు అవకాశం కలిగిందన్నారు. మందులు, ఎలక్ట్రానిక్, దుస్తులు, సిమెంట్, పాల డైరీ ఉత్పత్తులు జీఎస్టీ తగ్గింపు కారణంగా ధరలు తగ్గుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చేసిన మంచిపై ఇంటింటికీ టీడీపీ నాయకులు వెళ్లి వివరించాలని కోరారు. అలాగే డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారని, సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజల్లో సంతృప్తి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు, కార్యవర్గ సభ్యులు జోగులు, జి.నరేంద్ర, బి.లక్ష్మణ్‌రావు, ఎం.శ్యామ్, వి.శివ, కృపానందం, డి.శ్యామ్, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో యువత భవిష్యత్తుకు ముప్పు

- మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు
- జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్



ర్యాలీలో పాల్గొని మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్

అరకులోయ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వినియోగంతో యువత భవిష్యత్తుకు ముప్పు వాటిల్లుతుందని అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ చెప్పారు. మండల కేంద్రంలో 525 మంది ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి డ్రగ్స్ వద్దంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి ప్రధాన కూడలి వరకు ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడతూ గంజాయి మత్తులో పడి జీవితాలు నాశనం చేసుకోకూడదని చెప్పారు. మత్తు పదార్థాలకు ప్రతీ ఒక్కరూ దూరంగా ఉండాలని కోరారు. అలాగే గంజాయి పంట పండించడం, వ్యాపారం చేయడం, తరలించడం నేరమన్నారు. ఈ ర్యాలీలో సీఐ హిమగిరి, ఎస్ఐ గోపాలరావు, ఎన్‌సీసీ అధికారులు, వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

- గృహ నిర్మాణ శాఖ పీడీ బాబునాయక్



పుట్టచింతలో ఇళ్ల వివరాలు తెలుసుకుంటున్న పీడీ బాబునాయక్

అనంతగిరి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ బాబునాయక్ సూచించారు. మండలంలోని కొత్తూరు పంచాయతీ పుట్టచింత గ్రామంలోని పీఎం జన్మన్ ఇళ్ల నిర్మాణాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ వివిధ స్థాయి నిర్మాణాల్లో ఉన్న ఇళ్లకు సంబంధించి అధికారులు రికార్డు చేసిన మూడు రోజుల్లో బిల్లులు అందుతున్నాయని చెప్పారు. 2026 మార్చి 31తో పీఎం జన్మన్ పథకం ముగుస్తుందని, ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు.బిల్లులు చెల్లింపుపై అపోహలు వీడాలని, బిల్లుల్లో జాప్యం లేదని ఆయన స్పష్టం చేశారు. నాణ్యతాప్రమాణాలతో ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలని, ఇళ్లు మంజూరైన ప్రతీ లబ్ధిదారుడు వెనువెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవిగా దుర్గాదేవి

- భక్తులతో కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు



సరస్వతీదేవిగా దర్శనమిస్తున్న మహాలక్ష్మీదేవి

పాడేరురూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ ఆలయాల్లో అమ్మవార్లు సోమవారం భక్తులకు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. అయ్యప్ప స్వామి ఆలయంలో కొలువైన మహాలక్ష్మి, ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కొలువైన రాజరాజేశ్వరిదేవి, కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మల దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఆలయంలో తల్లిదండ్రులు పిల్లలతో అక్షరాభ్యాసాలను చేయించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఆర్థిక వెసులుబాటు




జీఎస్టీ తగ్గింపుపై కొయ్యూరులో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొయ్యూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో వ్యాపారులు ధరలను తగ్గించి విక్రయాలు జరపాలని, లేకుంటే జరిమానాలతో పాటు చర్యలు తప్పవని వాణిజ్య పన్నుల శాఖాధికారి గాదం భాస్కరరావు పేర్కొన్నారు. సోమవారం జీఎస్టీ తగ్గింపుపై మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. సామాన్యులకు ఆర్థిక వెసులుబాటు దొరికిందన్నారు. అనంతరం దుకాణాలను సందర్శించారు. సబ్బులు, టూత్‌పేస్టు వంటి వాటిపై 12 నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గిందని, పాల ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గిందని, నిత్యావసర సరకులు ధరలు తగ్గాయన్నారు. తగ్గింపు ధరలకే అమ్మకాలు చేయాలని ఆదేశించారు. అనంతరం కొయ్యూరు, రాజేంద్రపాలెం, సురేంద్రపాలెం గ్రామాల్లో ప్రజలకు తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో ఎంపీడీవో బాల మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

జి.మాడుగులలో..

జీఎస్టీ తగ్గింపుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జీఎస్టీ ప్రత్యేకాధికారి ధర్మపాల్ సూచించారు. సోమవారం ఆయన ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజుతో కలిసి మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. తగ్గిన నిత్యావసరాల ధరలపై వినియోగదారులతో పాటు షాపు యజమానులకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం అక్టోబరు 9వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

డొంకరాయి నీటి విడుదల నిలిపివేత



డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదలను నిలిపివేసిన దృశ్యం

సీలేరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదలను సోమవారం సాయంత్రం నుంచి నిలిపివేసినట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. జలాశయం ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో సోమవారం సాయంత్రానికి డొంకరాయి జలాశయం నీటి మట్టం 1034.40 అడుగుల వద్ద స్థిరంగా కొనసాగుతున్నది. దీంతో సోమవారం సాయంత్రం నాలుగున్నర సమయంలో 6,7 రెండు గేట్లను దింపి నీటి విడుదలను నిలిపివేశామని జెన్‌కో అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీల్లో బాలలకు ప్రీ స్కూల్ విద్య



పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శ్రీదేవి

చింతపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలబాలికలకు ప్రీ స్కూల్ విద్యా బోధన నిర్వహిస్తున్నామని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పీవో సీహెచ్. శ్రీదేవి అన్నారు. సోమవారం లోతుగెడ్డ సెక్టారులో మేడూరు, మేడూరు కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ మా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను కార్యకర్తలు బోధించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు ఆటపాటలతో నర్సరీ స్థాయి విద్యను అందించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారింర సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ డి. తులసి పాల్గొన్నారు.

సంక్రాంతి నాటికి పేదలకు పక్కా గృహాలు

తుమ్మపాల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి నాటికి పేదలకు పక్కా గృహాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని మాజీ ఎమ్మెల్యే, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. తుమ్మపాలలో సోమవారం జరిగిన టీడీపీ మండల నాయకుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజ లకు సంక్షేమ ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల లక్ష్యంగా పేర్కొన్నారు. త్వరలో పేదలకు స్థలాలు అందించనున్నామని చెప్పారు. అనంతరం సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ అంశంపై అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గింపు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబి, నాయకులు నంబారు శ్రీనివాసరావు, ఆడారి గోవిందరావు, తలారి కాశినాయుడు, బత్తుల రమేష్, మెయ్యా నూకరాజు, చెక్కల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు

పాడేరురూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి మహోత్సవాల సందర్భంగా పట్టణంలోని మెయిన్ బజారులో సోమవారం దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. తొలుత అమ్మవారి విగ్రహాన్ని సారెతో ఊరేగించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ ఊరేగింపులో అధిక సంఖ్యలో భవానీ మాలధారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు వెయ్యాకుల మోద వెంకట సత్యనారాయణ, శివరాత్రి నాగేశ్వరరావు, పచ్చా మాణిక్యాలరావు, పూసర్ల గోపి, బిక్కవోలు నూకరాజు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏరువాక వెంకటరమణ, యాదగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర రహదారిని నిర్మించండి

- కలెక్టర్‌కు జేఏసీ నేతలు వినతి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

సీలేరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర పాలగెడ్డ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్‌కు ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు, ఏపీ ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామారావుదొర సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జీకేవీధి మండలం ఆర్వీనగర్ నుంచి వై.రామవరం మండలం పాలగెడ్డ వరకు రహదారి పూర్తిగా శిథిలమైందన్నారు. గతంలో నిధులు మంజూరైనా పనులు చేయలేదన్నారు. ఈరోడ్డుపై రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు కూడా సకాలంలో వెళ్లలేని దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఇప్పటికైనా రహదారి సమస్యను గుర్తించి, త్వరితగతిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నర్సి పాపారావు, మణుగూరి బాబీ, మాధవరావు, అనిల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల సమస్యలపై ఎంపీకి వినతి



ఎంపీ తనూజరాణికి వినతిపత్రం సమర్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

పాడేరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని పనిచేస్తున్న వైద్యుల సమస్యలపై అరకులోయ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ జి.తనూజారాణికి వైద్యుల బృందం సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసును సమర్పించామన్నారు. అలాగే తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని, లేకుంటే దశలవారీగా తామంతా ఆందోళన బాట పడతామని పీహెచ్‌సీ వైద్యులు పేర్కొన్నారు. అలాగే తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీ తనూజారాణిని వైద్యులు కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

పెదబయలు, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతగుంట పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి రోగులు భారీగా తరలివచ్చారు. మొత్తం 105 మంది రోగులు రాగా, అందులో 15 మందికి క్యాన్సర్, తలసేమియా లక్షణాలు ఉన్నట్టు నిర్ధారించడం జరిగిందని అపోలో ఆస్పత్రి అసిస్టెంట్ మేనేజర్ ఎస్.అనిల్‌గోపి, ఎన్.రవి తెలిపారు. గిరిజన ప్రాంతంలో ఇటువంటి వైద్య శిబిరాలు అన్ని మండలలాల్లో నిర్వహిస్తునానమని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక వైద్యులు నజ్రీన్, రాంబుపాల్, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

'అనుమతులు లేకుండా బాణసంచా తయారీ నేరం'

సబ్బవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని తహశీల్దార్ బి.చిన్నికృష్ణ హెచ్చరించారు. మండలంలోని గుల్లేపల్లి, మలునాయుడుపాలెం, గంగవరం గ్రామాల్లో సోమవారం సీఐ జి.రామచంద్రరావు, జిల్లా సహాయ కార్మిక అధికారి పి. సూర్యనారాయణతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా తయారీ కేంద్రాల వద్ద నిబంధనలు విధిగా పాటించాలన్నారు. పరిమితి మించి సామగ్రి నిలువ చేసినా చర్యలు చేపడతామని హెచ్చరించారు. సహాయ కార్మిక అధికారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


'క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం'

ఎలమంచిలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రీడారంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను క్రీడాకారులు అందిపుచ్చుకోవాలని జనసేన పార్టీ నేతలు ఊటకూటి రమేష్, కొఠారు శ్రీను అన్నారు. పట్టణంలోని రాజీవ్ గాంధీ క్రీడామైదానంలో జరుగుతున్న హాకీ టోర్నీ 2వ రోజు క్రీడాకారులతో కలిసి ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాకీ క్రీడాకారులు సీనియర్ క్రీడాకారుల నుంచి మెలకువలు అందిపుచ్చుకోవాలన్నారు. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులంతా స్నేహపూర్వక వాతావరణంలో తమ ప్రతిభను ప్రదర్శించాలన్నారు.

డి.పట్టా భూములను ఆన్‌లైన్ చేయాలి

ఎస్.రాయవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగుమ్ములూరు సచివాలయం వద్ద డి పట్టా భూములను ఆన్‌లైన్ చేయాలంటూ దళితులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎం. సత్యనారాయణ మాట్లాడుతూ 2005లో దళితులకు ఇచ్చిన డి పట్టా భూములను ఆన్‌లైన్ చేయకపోవడంతో నష్టపోతున్నారని తెలిపారు. గ్రామానికి చెందిన అగ్ర వర్ణాల వారికి రెవెన్యూ అధికారులు కొమ్ము కాస్తూ దళితుల డి పట్టా భూములను ఆన్‌లైన్ కాకుండా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సరస్వతీదేవి అలంకరణలో దుర్గామాత



చోడవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఆవరణలోని దుర్గగుడిలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సహస్ర పెన్నులతో అమ్మవారిని అలంకరించారు. సరస్వతీదేవి అవతారంలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

నర్సీపట్నం: దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. విద్యార్థులతో తల్లిదండ్రులు సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగేంద్రరాజు పిల్లలకు పెన్నులు, పుస్తకాలు అందించారు.

సామూహిక అక్షరాభ్యాసాలు



ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం చేస్తున్న చిన్నారులు

రావికమతం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట దుర్గాదేవి ఆలయంలో నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు సోమవారం సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. పలు గ్రామాల భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి గుడికి వచ్చిన చిన్నారులకు పలకలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు వేపా రామకృష్ణ కిశోర్ ఆధ్వర్యంలో చిన్నారులతోసామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అలాగే కొత్తకోట గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారి ఉల్లూరి రాజు దంపతులు సరస్వతీదేవి అలంకరణ కోసం వెండి వీణను బహూకరించారు.

కూటమి పాలనతోనే సమస్యలకు పరిష్కారం

- జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు
- జనసేనలో చేరిన కొత్తకోట వైసీపీ నాయకులు



వైసీపీ నుంచి జనసేనలో చేరిన నాయకులతో ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు

చోడవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనతో సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు చెప్పారు. రావికమతం మండలంలోని కొత్తకోట మేజర్ పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి, సోమవారం జనసేనలో చేరారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ జనసేన పట్ల తక్కువ కాలంలోనే ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు. కొత్తకోటకు చెందిన సీతశ్రావణి, గిరి, సీత సత్తిబాబు, భాను, నగేష్, మారుతి, దివాకర్, రాఘవేంద్రరావు, సాయినాథ్, వెంకట సాయి, దుర్గ, చిరంజీవి, బుజ్జి వైసీపీని వీడి జనసేన తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన నాయకులకు ఇన్‌చార్జి రాజు సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు మైచర్ల నాయుడు, దాసరి చిన్నబ్బాయ్, అప్పలరాజమ్మ, చింతల కిశోర్, కోన రమణ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ సారె ఊరేగింపు



నాగాపురంలో అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకు వెళ్తున్న భక్తులు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రులను పురస్కరించుకుని ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట గ్రామాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా సీహెచ్.నాగాపురంలో కనకదుర్గమ్మకు సారెను సమర్పించేందుకు గ్రామంలో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం ఆలయాల వద్ద భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, టీడీపీ నాయకులు బొప్పన ప్రసాద్, ఎం.వరహాలబాబు, నిర్వాహకులు పాల్గొన్నారు.

పోలిపిల్లమ్మకు సారె సమర్పణ



అమ్మవారికి సారెను ఉరేగింపుగా తీసుకు వెళ్తున్న భక్తులు

మాడుగుల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నవరవీధిలోని దుర్గ పోలిపిల్లమ్మ మూల పూజ పురస్కరించుకుని సోమవారం సర్వస్వతీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించకోవడానికి వచ్చిన చిన్నారులకు పెన్నులు, పుస్తకాలను ఆలయ కమిటీ వారు అందించారు. ఆలయ వ్యవస్థాపకులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సీతయ్యపేటలో తీరువీధి ఉత్సవం



తీరువీధి ఉత్సవంలో భక్తజన సంద్రం

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతయ్యపేట గ్రామంలో సోమవారం తీరువీధి ఉత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడివాడ అమర్‌నాథ్, జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, నాయకులు కోవెల జనార్దన్‌రావు, కె.అచ్చంనాయుడు, దొండా చినబాబు, జి.శ్రీనివాసరావు, జి.వరకృష్ణ, కోటేశ్వరరావు, గోలజాన శ్రీను, జి.సత్యనారాయణ, సత్యనారాయణ. వి.శ్రీను, బాబూరావు, చెల్లారావు, వాసు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కాగా ఉత్సవంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

యుద్ధప్రాతిపదికన తాచేరు కాజ్‌వే నిర్మాణం

- 48 గంటల్లో పాదచారులు, ద్విచక్ర వాహనాలకు అనుమతి
- చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



కాజ్‌వే వద్ద ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు... (ఇన్‌సెట్‌లో) తాజేరు కాజ్‌వే వద్ద పైపులు అమర్చుతున్న దృశ్యం

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయరామరాజుపేటలో తాచేరు కాజ్‌వే నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు చెప్పారు. కాజ్‌వే నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాజ్‌వేపై రాకపోకలకు 48 గంటల్లో పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులకు అనుమతిస్తామని చెప్పారు. బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు ఐదు రోజుల సమయం పడుతుందన్నారు. గతంలో కాజ్‌వే లోతుగా ఉండేదని, ఇప్పుడు లోతు లేకుండా ఎత్తు పెంచుతామన్నారు. ఇందుకోసం రూ.15 లక్షలు మంజూరయ్యాయని, ఈ నిధులు చాలకపోతే అదనపు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కొంత ఆలస్యమైనా నాణ్యతాప్రమాణాలతో కాజ్‌వే నిర్మించాలని ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అసెంబ్లీలో విజయరామరాజుపేట, వడ్డాది వంతెనలు ప్రస్తావించానన్నారు. అలాగే బీఎన్ రోడ్డు, శాశ్వత వంతెనల నిర్మాణానికి కృషి చేస్తున్నట్టు ఆయన చెప్పారు. అనంతరం వడ్డాది పెద్దేరుపై డైవర్షన్ రోడ్డును పరిశీలించారు. ఈ రోడ్డు పనుల కోసం రూ.7 లక్షలు మంజూరయ్యాయని, పనులు వెంటనే ప్రారంభించాలని ఆర్‌అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్య క్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ జి.సత్యనారాయణ, కూటమి నాయకులు ఎస్.శ్రీరామ్మూర్తి, దొడ్డి కిశోర్, దొండా సన్యాసిరావు, గిరిబాబు, సింగంపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యవంతమైన జీవనం

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యవంతంగా జీవించగలమని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. మాడుగుల కేంద్రంలో సోమవారం జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలంటే ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పోషకాహారం వినియోగించుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా 20 మంది గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించి, వారికి పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అంతకు ముందు దేవీ ఆలయంలో దుర్గమ్మను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీలో సూపరింటెంట్ చంద్రశేఖర్, సీడీపీవో ఎర్రయ్యమ్మ, ఎంపీపీ టి.రాజారాం, ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, పెద్దేరు జలాశయం చైర్మన్ అద్దెపల్లి జగ్గారావు, నాయకులు పుట్టా గంగయ్య, పుప్పాల రమేశ్, పుప్పాల లక్ష్మీనారాయణ, లెక్కల కాశిబాబు, సాయిరాం, దేవరాపల్లి శ్రీను, ఉందూరు దేముడు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో లోపాలపై సభ్యుల ధ్వజం

రైతులకు సమాచారం లేకుండా సర్వే చేసి వివాదాలు సృష్టించారు

మండల సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల మండిపాటు



తహశీల్దార్ నాగమ్మను నిలదీస్తున్న సభ్యులు

రోలుగుంట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జగనన్న రీ సర్వేలో లోపాలపై సభ్యులు ధ్వజమెత్తారు. రైతులకు సమాచారం లేకుండా రెవెన్యూ అధికారులు తప్పుల తడకగా భూములు ఆన్‌లైన్ చేయడంతో ఇప్పుడు తగాదాలు పడుతూ కోర్టుల చుట్టూ తిరిగాల్సిన దుస్థితి దాపురించిందని అసహనం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రోలుగుంటకు చెందిన శెట్టి రమణారావు, ఎర్రినాయుడు, గోవింద, లోవరాజు, కన్నబాబు, గణేశ్ తదితరులకు చెందిన సర్వే నంబర్ 166-1లో భూమిని మడ్డు వెంకటరమణ పేరున ఆన్‌లైన్ చేసి రెవెన్యూ అధికారులు భూ వివాదం సృష్టించారని రోలుగుంట ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ తహశీల్దార్‌ను నిలదీశారు. దీనిపై పలుమార్లు పీజీఆర్ఎస్‌పై ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదన్నారు. దీనిపై తహశీల్దార్ నాగమ్మ స్పందిస్తూ ఈ భూ సమస్య కోర్టు కేసులో ఉన్నందున, కోర్టు ఆదేశాల ప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కుసర్లపూడి, బుచ్చెంపేట, బీబీపట్నం గ్రామాల్లో తాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నామని సర్పంచులు మడ్డు అప్పలనాయుడు, గరగా విశ్వేశ్వరరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేశ్ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు నీరు అందించే పైపులైన్లు మరమ్మతుకు గురవుతున్నాయని తెలిపారు. అనంతరం ఏవో చిరంజీవి మాట్లాడుతూ ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో వరిసాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. మండలంలోని రైతులకు యూరియా కొరత లేదని స్పష్టం చేశారు. వ్యవసాయ రైతులకు రాయితీపై సోలార్ పథకాన్ని అమలు చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. రెండు మూడు శాఖల సమీక్ష మాత్రమే చేపట్టి మిగతా శాఖల ప్రస్తావన లేకుండానే సర్వసభ్య సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీడీవో నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది కూడలిలో సోమవారం జీఎస్టీ రేట్ల తగ్గింపుపై ఎమెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అవగాహన కల్పించారు. ప్రతీ దుకాణానికి వెళ్లి జీఎస్టీ కొత్త శ్లాబులను వ్యాపారులు, ప్రజలకు వివరించారు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ చాలా తగ్గిందని, 99 శాతం వస్తువులను పన్ను రహితం చేశారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చాలా వరకు డబ్బు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, ఈవో లవరాజు, విశాఖ డెయిరీ డైరెక్టర్ జి.సత్యనారాయణ, సర్పంచ్ కామ లక్ష్మి, కూటమి నాయకులు ఎస్.శ్రీరామ్మూర్తి, దొండా సన్యాసిరావు, గిరిబాబు, ఎస్.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వలంటీర్లకు శిక్షణ

నర్సీపట్నం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా విద్యా వలంటీర్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి వలంటీర్లకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తయారు చేయాలని సూచించారు. పదో తరగతి చదివిన ఒక ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు పది మంది నిరక్షరాస్యులకు రోజుకు గంట చొప్పున వయోజన విద్య బోధిస్తారన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం పి.వరలక్ష్మి, సీవో రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాడుగుల రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కింతలి సబ్‌స్టేషన్‌కు కొత్తగా లైను వేయడంతో పాటు మరమ్మతు పనులు చేస్తున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయవ ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ నర్సీపట్నం డివిజన్ ఈఈ అప్పారావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గాదిరాయి సబ్‌స్టేషన్ పరిధిలో జేడీపేట, జాలంపల్లి, లోవపొన్నవోలు, పంచాయతీల్లోని గ్రామాలకు మంగళవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ఈ అంతరాయాన్ని గమనించి ఆయా గ్రామాల ప్రజలు, వినియోగదారులు తమకుసహకరించాలని ఆయన కోరారు.

కేజే పురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజేపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సహస్ర నామ కుంకుమ పూజలు ఘనంగా చేశారు. మాలధారణ భక్తులతో పాటు సాధారణ భక్తులు పూజలో పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేటి రామకొండారావు భక్తులకు ఏర్పాట్లు చేశారు. పూజల అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

కన్నంపేటలో ప్రత్యేక వైద్య శిబిరం

రావికమతం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నంపేట గ్రామంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారిణి సురేఖ కిశోర బాలికలు, గర్భిణిలకు వైద్య పరీక్షలు చేశారు. అలాగే మరి కొందరికి బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలు చేశారు. రక్తహీనత అధిగమించేందుకు తగిన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, సర్పంచ్ డి.సత్యవతి, వైద్య సిబ్బంది పాతాళ రామారావు, కల్యాణి, సౌజన్య, సంతు, లక్ష్మి, మౌనిక, సౌజన్య, నాయకులు దంట్ల సత్యనారాయణ, బంటు శ్రీను పాల్గొన్నారు.

బలిఘట్టంలో సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

నర్సీపట్నం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఏబీఎం విద్యా సంస్థల కరస్పాండెంట్ అంకంరెడ్డి గిరిబాబు, ఆయన సోదరుడు అకంరెడ్డి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు అంకంరెడ్డి సన్యాసమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి రమణ, హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించండి

దేవరాపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని విశాఖపట్నంకు చెందిన జీఎస్టీ అధికారి ఎం.కేదారేశ్వరరావు సూచించారు. ఎంపీడీవో సువర్ణరాజు, డిప్యూటీ ఎంపీడీవో కిరణ్ వరప్రసాదు, కార్యదర్శి ఉమాదేవీలతో కలిసి అపోలో పార్మసీ, సూపర్ మార్కెట్, తదితర షాపులను సోమవారం తనిఖీ చేశారు. తగ్గిన జీఎస్టీని వినియోగదారులకు అమలు చేస్తున్నదీ? లేనిదీ? పరిశీలించారు. జీఎస్టీ రేట్లతను దుకాణాల ముందు ఉంచకపోతే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ అవినాష్, కోఆర్డినేటర్ వీపీవీ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపునకు కృషిచేయాలి

టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ

నాతవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి కలసికట్టుగా పనిచేయాలని పార్టీ మండల అధ్యక్షుగు నందిపల్లి వెంకటరమణ కోరారు. మర్రిపాలెం గ్రామంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. తద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొంద్రు మరిడియ్య మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు బంధువుల పేరుచెప్పి వైసీపీ నాయకులకు పనులు చేస్తున్నారని, దీనివల్ల నిజమైన టీడీపీ కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. తెలుగు యువత మండల అధ్యక్షుడిగా పోలుపర్తి సాయి, తెలుగురైతు మండల అధ్యక్షుడిగా జీరెడ్డి రాజుబాబు, మండల మహిళ అధ్యక్షురాలుగా సత్యవతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ. పీఏసీఎస్ చైర్‌పర్సన్లు ఎ.మాణిక్యం, ఎస్.సన్యాసిదేముడు, ఎ.నానిబాబు, నాయకులు పి.కొండబాబు, ఎస్.విజయ్‌కుమార్, పైల సూరిబాబు సిహెచ్.శ్రీనువాసు, ఐ.సీతారామ్మూర్తి పాల్గొన్నారు.

వైసీపీ డిజిటల్ యాప్ ఆవిష్కరణ

దేవరాపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తారువ గ్రామంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, వైసీపీ నాయకులు బి.బాబూరావు, పి.సింహాచలంనాయుడు, కె.వీరమణ తదితరులు పాల్గొన్నారు.

బాబా శత జయంతి ఆహ్వాన పత్రికల విడుదల



బాబా శత జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న స్పీకర్ అయ్యన్న

నర్సీపట్నం అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సోమవారం విడుదల చేశారు. ఈ ఏడాది నవంబరు 23న జరగనున్న ఈ ఉత్సవాలకు తప్పని సరిగ్గా హాజరుకావాలని అయ్యన్నపాత్రుడును ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆకాక్షించారు. ఆహ్వాన పత్రికలు అందించిన వారిలో జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు కె.అప్పలనాయుడు, జిల్లా గ్రామ సేవ ఇన్‌చార్జి సుధాకర్ మౌళి, నర్సీపట్నం కన్వీనర్ శివరామరాజు, ఎ.అప్పలనాయుడు పాల్గొన్నారు.

తహశీల్దార్ శ్రీనివాసరావు సేవలు చిరస్మరణీయం



తహశీల్దార్ శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న రెవెన్యూ అధికారులు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తహశీలార్‌గా శ్రీనివాసరావు ఏడాది పాటు ఇక్కడ అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం రిటైర్డ్ తహశీల్దార్ శ్రీనివాసరావుకు వీడ్కోలు సభ నిర్వహించారు. రెవెన్యూ శాఖలో సుదీర్ఘంగా సేవలందించారని, ఎన్నో ఒడుదొగులు ఎదుర్కొన్నారని వక్తలు కొనియాడారు. అనంతరం రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తహశీల్దార్ దంపతులకు పూలమాలలువేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాతవరం, పాయకరావుపేట తహశీల్దార్లు వేణుగోపాలరావు, మహేశ్, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ ఏవో సుధాకర్, రిటైర్డ్ ఏవో సూర్యనారాయణ, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎ.అప్పలనాయుడు, చోద్యం సర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, టీడీపీ నాయకులు చిటికెల సాంబమూర్తి, సత్యనారాయణ, నాయకులు, అధికారులు, తదిరులు పాల్గొన్నారు.

తాచేరు బాధిత కుటుంబాలకు అమర్ పరామర్శ



రోహిత్ కుటుంబీకులతో మాట్లాడుతున్న అమర్

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయరామరాజుపేట తాచేరు కాజ్‌వే నీటి ప్రవాహంలో మరణించిన వారి కుటుంబ సభ్యులను వైసీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి గుడివాడ అమర్‌నాథ్ సోమవారం పరామర్శించారు. ఆదారి రోహిత్ కుటుంబ సభ్యులను కలిసి, వారిని ఓదార్చారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్ర మంలో జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, నాయకులు కోవెల జనార్ధనరావు, దొండా నారాయణమూర్తి, జోగా కొండబాబు, నమ్మి అప్పలరాజు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి సాధ్యం

నాతవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ అక్షరాస్యతతోనే దేశాభివృద్ధి సాధ్యమని, వయస్సుతో సంబంధం లేకుండా చదవటం రాయటం నేర్చుకోవాలని తహశీల్దార్ ఎ.వేణుగోపాల్ కోరారు. సోమవారం మర్రిపాలెం గ్రామంలో వయోజనులు చదువుకోవాలంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక నాయకులు, అధికారులతో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ఎక్కువగా అక్షరాస్యతపైనే ఆధారపడుతుందన్నారు. అనంతరం ఇన్సూరెన్స్, ఇతర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగహన కల్పించారు. ఎస్ఐ తారకేశ్వరరావు మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు గ్రామాలలో కోడిపందాలు, పేకాట ఆడవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యశ్రీనివాసు, వెలుగు ఏపీఎం కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీ వినియోగించుకోండి

గొలుగొండ సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులు సకాలంలో పంట రుణాల వాయిదాలు చెల్లించి వడ్డీరి సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ చిటికెల సాంబమూర్తి కోరారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ సభ్యులతో సోమవారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. గొలుగొండ పీఏసీఎస్ ద్వారా వివిధ రకాల పంట రుణాలు అందించాన్నారు. వాటిని సకాలంలో తిరిగి చెల్లించి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రేగుబల్ల శివ, కె.నూకరాజు, టీడీపీ నాయకులు సుర్ల బాబ్జీ, కార్యదర్శి మూర్తి, పలు గ్రామాలకు చెందిన సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ కోసం గిరిజనుల నిరసన

దేవరాపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజోతి): చింతలపూడి పంచాయతీలోనే రేషన్ ఇవ్వాలని, పంచాయతీకి ప్రత్యేక డిపోను ఏర్పాటు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సమ్మెదలో వంతువానిపాలెం గిరిజనులతో కలసి సోమవారం నిరసన తెలిపారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ తామరబ్బ, చింతలపూడి పంచాయతీలు చాలా కాలం నుంచి రేషన్ కార్డుల ప్రాతిపదికన ఒకే రేషన్ డిపో మాజూరు చేసినట్టు చెప్పారు. ముకుందపురం గ్రామంలో రేషన్ సరుకులు ఇచ్చేవారని, ప్రస్తుతం 12 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. రేషన్ డిపోకు సుమారు 12 కిలోమీటర్లు దూరం రావాల్సి ఉంటుందన్నారు. డిపో మంజూరు చేయాలని వారు కోరారు.

భూములను సర్వే చేయాలని ఫిర్యాదు

మాకవరపాలెం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా నిర్వహించిన సర్వే రద్దు చేయాలని తామరం పీఏసీఎస్ డైరెక్టర్ అడిగర్ల రాంబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు కె.నాయుడుతో పాటు రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే రైతుల జాబితాలను సచివాలయాల్లో వేలాడదీయడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. తహశీల్దార్ కారాలయానికి ఇ సుమారు 30 మంది రైతులు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. సాగులో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్నప్పటికీ తమ పేర్లు జాబితాల్లో కనపడలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రుత్తల రమేశ్, అంజనేయులు, రుత్తల జమీలు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఆయుధపూజ


పూజలు చేసిన ఆయుధాలు

సింహాచలం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సింహాచలం దేవస్థానంలో సోమవారం ఆయుధపూజ నిర్వహించారు. అప్పన్నకు ఉత్సవాల సందర్భంగా అలంకరించే కత్తి, ఖడ్గం, కైజారు, గద, శరం, విల్లంబు, సుదర్శ చక్రం, తదితర ఆయుధాలకు షోడశోపచారాలు సమర్పించి, ప్రత్యేక పూజల తరువాత పలురకాల ఫలాలను నివేదన చేశారు. ఆలయ స్థానాచార్యులు టీపీ రాజగోపాల్ పర్యవేక్షణలో పురోహితులు ఈ కార్యక్రమం జరిపారు. మూడు రోజులపాటు ఉభయ సంధ్యలలో ఆయుధ పూజ కొనసాగుతుంది.

వీఎంఆర్‌డీఏ చైర్మన్ పదవీకాలం పొడిగింపు

» మరో ఏడాది అవకాశం

విశాఖపట్నం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) చైర్మన్ ప్రణవ్ గోపాల్ పదవీకాలం మరో ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా వ్యవహరిస్తున్న ప్రణవ్ గోపాల్‌ను వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా ఏడాది కాలానికి నియమించిన సంగతి తెలిసిందే. ఆ గడువు నవంబరు 20వ తేదీతో ముగిసిపోనున్న తరుణంలో మరో ఏడాది పొడిగిస్తూ సోమవారం ఉత్తర్వులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తన సేవలు గుర్తించి పొడిగింపు ఇచ్చినందుకు సీఎం చంద్రబాబునాయుడుకు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. భోగాపురం విమానాశ్రయానికి కనెక్ట్ అయ్యే మాస్టర్ ప్లాన్ రహదారులన్నింటినీ స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో వచ్చే జూన్ నాటికి పూర్తిచేస్తామన్నారు.

33 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

అనకాపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రధాన ఉద్దేశంగా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం సాయం అందిస్తున్నదని ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. అనకాపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం 33 మందికి రూ.25,55,543 మేర సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, బీజేపీ నేత చొక్కాకుల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు అవస్థలు


శవ పేటికను కస్పా కాలువ దాటిస్తున్న దృశ్యం

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వడ్డాది గ్రామంలో శ్మశానవాటిక లేక మూడు కులాల వారికి కష్టాలు తప్పడం లేదు. వడ్డాది కొత్తూరులో ముత్యాల గణేశ్ అనే వ్యక్తి సోమవారం అనారోగ్యానికి గురై మృతి చెందాడు. శ్మశానవాటిక లేకపోవడంతో గణేశ్ మృతదేహాన్ని మోసుకుంటూ కస్పా కాలువ దాటి ఒడ్డున ఉన్న తుప్పల్లో ఖననం చేశారు. శ్మశానవాటిక లేకపోవడంతో దేవాంగులు, స్వర్ణకారులు, కుమ్మరుల్లో ఎవరైనా మరణిస్తే కష్టాలు తప్పడం లేదని, పంచాయతీ అధికారులు స్పందించి స్థలం కేటాయించాలని ఆయా కులాల వారు కోరుతున్నారు.

బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు ససేమిరా

... 5వ పేజీ తరువాయి

పరిధిలో లేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని, కమిటీని తీసుకువెళ్లిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటానని చెప్పారు. అనంతరం ఆమె తిరుగు ప్రయాణం కాగా కాన్వాయ్‌ను వందల సంఖ్యలో మత్స్యకారులు, మహిళలు అడ్డగించారు. తమకు న్యాయం చేయాలని మత్స్యకారులు పట్టుబట్టారు. ఈ హఠాత్పరిణామానికి పోలీసులు, కూటమి నాయకులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. హోం మంత్రి అనిత కారు డోర్ తీసి మత్స్యకారులు అమాయకులని, వారిపై ఎటువంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు ఆదేశాలు జారీచేశారు. కమిటీ ఏర్పాటై సీఎం, డిప్యూటీ సీఎం వద్దకు తీసుకువెళ్లేంత వరకూ పనులు ఆపిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులంతా అడ్డుతొలగారు.

మత్స్యకారులను కావాలనే రెచ్చగొడుతున్నారు

రాజయ్యపేట సహా మత్స్యకార గ్రామాలన్నీ ఎన్నికల సమయంలో టీడీపీకి అండగా నిలిచాయని మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మత్స్యకారులంతా అమాయకులని, అటువంటి వారిని కావాలని కొందరు బయట వ్యక్తులు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. మత్స్యకారులను ఇబ్బంది పెట్టాలనేది తమ లక్ష్యం కాదన్నారు. సోమవారం రాత్రి స్థానికంగా ఉన్న క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. బల్క్ డ్రగ్ పార్కు అనేది వైసీపీ ప్రభుత్వ పాలనలో మంజూరైతే వారంతా పాలాభిషేకం చేశారన్నారు. ప్రస్తుతం అన్ని పార్టీల నుంచి ఒక కమిటీ ఏర్పాటుచేయాలని సూచించానని, దసరా తరువాత సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. మత్స్యకారుల సోదరుల కడుపుకొట్టి, వారిని ఇబ్బంది పెట్టేలా బయట ప్రాంతాలకు చెందిన వ్యక్తులు రాజకీయాలు చేయకూడదని సూచించారు. మత్స్యకారుల వేట నిషేధ భృతి రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నీట మునిగి ఇద్దరి మృతి

... 5వ పేజీ తరువాయి

కన్నీరుమున్నీరు అయ్యారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా మండలంలోని బి.కింతాడ గ్రామానికి చెందిన భరణికాన అప్పలరాజు (35) సోమవారం ఉదయం బహిర్భూమికని శారదా నది తీరానికి వెళ్లాడు. ఈ సమయంలో అతనికి ఫిట్స్ రావడంతో నీటిలో మునిగిపోయాడు. అప్పుడు సమీపంలో ఎవరూ లేకపోవడంతో కాపాడలేకపోయారు. ఎంతసేపైనా అప్పలరాజు ఇంటికి రాకపోవడంతో భార్య రత్నం గ్రామంలో పలువురిని వాకబు చేసింది. చెరువు వైపు వెళ్లినట్టు చెప్పడంతో అక్కడికి వెళ్లగా.. అప్పలరాజు మృతదేహం నీటిలో కనిపించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


స్వస్థ్ నారీ ప్రతిజ్ఞ చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, అధికారులు


సీమంతం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పసుపు, కుంకుమలు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఆరోగ్య పథకాలు భేష్

» అమలు తీరులోనే లోపాలు
» స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు చాలా మంచివని, అయితే అధికారులు అమలు చేయడంలోనే లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దుకుంటే ఫలితాలు బాగుంటాయని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం ఏరియా ఆస్పత్రిలో స్వస్థ్ నారీ- సశక్తి అభియాన్ కార్యక్రమంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన బీపీ, షుగర్, క్యాన్సర్, టీబీ స్క్రీనింగ్, బాల్య వివాహాలు, మానసిక సమస్యలు, సికిల్‌సెల్ ఎనీమియా, ఐసీడీఎస్ పౌష్టికాహారం కౌంటర్లను స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు సందర్శించారు. అనంతరం ప్రాంతీయ ఆస్పత్రి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వస్థ్ నారీ- సశక్తి అభియాన్ కార్యక్రమం చాలా మంచిదన్నారు. ఆశ కార్యకర్తలు వారి పరిధిలోని ప్రతీ ఇంటికి వెళ్లి మహిళల ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసు కోవడంతో పాటు గర్భిణులు ఉంటే హెల్త్ కార్డులో నమోదు చేయాలన్నారు. ఆశ కార్యకర్తలు పని తీరు మెరుగు పరుచుకోవడం లేదన్నారు. గర్భిణుల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసిన తరువాత రోగిని విశాఖపట్నం పంపించి వైద్యం చేయించాలని సూచించారు. 70 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు కేంద్ర ప్రభుత్వం ప్రతీ ఏటా రూ.5 లక్షల విలువైన ఆరోగ్య బీమా పథకం అమలు చేస్తుందన్నారు. ఏరియా ఆస్పత్రికి వచ్చే గర్భిణులు ప్రసవం అయ్యే వరకు రెండు మూడు రోజు ఉండడానికి రూ.2.1 కోట్ల నిధులతో 50 పడకలతో ప్రత్యేకంగా నిరీక్షణ విభాగం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యవంతమైన స్త్రీ కోసం.... శక్తివంతమైన కుటుంబం కోసం కృషి చేస్తామని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద, ఆర్డీవో వీవీ రమణ, తహశీల్దార్ రామారావు, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి సూర్య చంద్ర పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలకు సత్వర పరిష్కారం


అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్


ప్రజల సమస్యలను ఆలకిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

» కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో డీఆర్‌వో వై.సత్యనారాయణరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పలు వురి సమస్యలను స్వయంగా ఆలకించి, పరిష్కారానికి భరోసా ఇచ్చారు. అనంతరం అధి కారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీదారులతో స్వయంగా మాట్లాడి సమస్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. నిబంధనలకు లోబడి సమస్యలను పరిష్కరించే అవకాశం వున్న అర్జీలను వెంటనే క్లియర్ చేయలన్నారు. ఒకవేళ పరిష్కారం చేయడానికి వీలుకాకపోతే అందుకుగల కారణాలను వివరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 232 అర్జీలు అందాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో అందే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ తుహిన్ సిన్హా పోలీసులు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో స్వయంగా మాట్లాడి సమస్యను ఆలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అందిన అర్జీలకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలను వారం రోజుల్లో విచారణ పూర్తిచేసి, న్యాయపరంగా ఇబ్బందులు లేనివాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్‌లో 32 అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు.

గడువులోగా ప్రారంభిస్తే పరిశ్రమలకు ప్రోత్సాహకాలు

» 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' సదస్సులో కలెక్టర్ హరేంధిర ప్రసాద్
» ఎనిమిది జిల్లాల పారిశ్రామికవేత్తలు, అధికారులతో రీజనల్ అవుట్‌రీచ్ వర్క్ షాపు నిర్వహణ



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొని నిర్ణీత గడువులోగా అంటే ఏడాది నుంచి ఏడాదిన్నరలోపు పరిశ్రమలు కార్యకలాపాలు/ఉత్పత్తి ప్రారంభిస్తే...వారికి అదనపు ప్రోత్సాహకాలు ఇస్తామని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఎనిమిది (విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి, కాకినాడ, కోనసీమ, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం) జిల్లాల పారిశ్రామికవేత్తలు, అధికారులతో సోమవారం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' రీజనల్ అవుట్‌రీచ్ వర్క్ షాపు నిర్వహించారు. దీనికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, గత ఏడాదిన్నర కాలంలో పారిశ్రామిక రంగంలో అనేక మార్పులు వచ్చాయని, సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు ఇవ్వడమే కాకుండా నిర్ణీత గడువు దాటిన తరువాత ఆయా ప్రాజెక్టులకు 'డీమ్డ్ టు బి అప్రూవల్' మంజూరవుతోందన్నారు. గత ఏడాది కాలంలో విశాఖ జిల్లాలో లక్ష కోట్ల రూపాయల ప్రాజెక్టులకు ఒప్పందాలు జరిగాయని, వాటి ద్వారా ఎనిమిది లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయన్నారు. పారిశ్రామికవేత్తలను వేధించకుండా ఉండేందుకు వివిధ శాఖల తనిఖీలు తొలగించారని, అంతా కలిసి ఒకేసారి ఇన్‌స్పెక్షన్ చేసేలా కేంద్రీయ విధానం అమలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా రెన్యువల్స్‌కు కూడా ఆటోమేటిక్ విధానం పాటిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది కూడా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై ర్యాంకింగ్ ఇస్తుందని, సుమారు ఆరు వేల మంది నుంచి అభిప్రాయాలు సేకరిస్తుందని, అనుకూలంగా వారికి సమాధానాలు చెబితే మళ్లీ ఏపీకి మొదటి ర్యాంకు వస్తుందన్నారు. పారిశ్రామికవేత్తలు సూచించిన మార్పులు చేయడానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి విశాఖ జిల్లా పరిశ్రమల శాఖ అధికారి జి.ఆదిశేషు అధ్యక్షత వహించగా, అడిషనల్ డైరెక్టర్ రామలింగరాజు, శ్రావణ్ షిప్పింగ్ ఎండీ సాంబశివరావు, వాశిశ్వ అధ్యక్షులు పాండురంగ ప్రసాద్ పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలు చేసిన సూచనలు

- సింగిల్ విండో ద్వారా డీమ్డ్ టు బి అప్రూవల్ పొందిన ప్రాజెక్టులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. ఒరిజినల్ ఫైల్ కావాలని అడుగుతున్నాయి. దీనిపై బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటుచేసి మార్గదర్శకాలు ఇవ్వాలి.
- పరిశ్రమలకు ఈపీడీసీఎల్ స్మార్ట్ మీటర్లను అమర్చింది. అయితే వాటికి సరైన కెపాసిటర్లు అమర్చుకునే విషయంలో సహకారం లేదు. ఖర్చులు పెరిగాయి. వారితో అవగాహన సదస్సు నిర్వహించాలి.
- పరిశ్రమలకు ఆస్తి పన్ను విధానం మార్చాలి. గతంలో అద్దె ఆధారంగా, ఇప్పుడు కేపిటల్ విలువ ఆధారంగా పన్నులు వేస్తున్నారు. ఇవి భారంగా ఉన్నాయి. తక్కువ పన్ను ఉండేలా కొత్త విధానం తీసుకురావాలి.

ఓపీగ్గా పడిగాపులు

... 5వ పేజీ తరువాయి

పట్టుకొని 'అభా' రిజిస్ట్రేషన్ కోసం క్యూలో ఉండాలి. తమ వంతు వచ్చిన తర్వాత ఆధార్ నంబరు చెబితే మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. పేషెంట్ ఓటీపీ చెప్పిన తర్వాత సిబ్బంది చీటి ఇస్తారు. దానిని పట్టుకొని ఓపీ కౌంటర్ వద్దకు వెళ్లి క్యూలో నిలబడాలి. సిబ్బంది కంప్యూటర్‌లో 'అభా' నంబరు నమోదు చేసి, చీటి మీద ఓపీ నంబరు రాసి ఇస్తారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి అర గంటకుపైగా సమయం పడుతున్నది. దీంతో రోగులు క్యూ లైన్లలో నిల్చుని నీరసించిపోతున్నారు. రోగుల్లో అత్యధికులు తొమ్మిది గంటల ప్రాంతంలో వస్తుండడంతో అభా కౌంటర్, ఓపీ కౌంటర్ వద్ద రోగుల రద్దీ అధికంగా వుంటున్నది. ఏరియా ఆస్పత్రికి సోమ, బుధ, శనివారాల్లో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోజుల్లో 'అభా' రిజిస్ట్రేషన్‌కు, ఓపీ చీటి రాయించుకోవడానికి ఎక్కువ సమయం పడుతున్నదని రోగులు వాపోతున్నారు. సోమవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి ఏరియా ఆస్పత్రికి వచ్చిన స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి ఈ విషయం రావడంతో ఆస్పత్రి వర్గాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటీపీ వచ్చే వరకు రిజిస్ట్రేషన్ చేయకపోతే పేషెంట్ ఎంతసేపు నిల్చుని వుంటారని నిలదీశారు. అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేసి, ఓపీ చీటీల జారీని వేగవంతం చేయాలని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశాదను ఆదేశించారు.

మహిళల ఆరోగ్యానికి పెద్ద పీట

... 5వ పేజీ తరువాయి

అందించడం, పోషకాహార వినియోగాన్ని ప్రోత్సహించడం వంటివి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా మహిళల ఆరోగ్యం మెరుగుపడి, తద్వారా యావత్ కుటుంబం సంతోషంగా ఉంటుందని పేర్కొన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణల్లో భాగంగా పలు రకాల ఔషధాలపై పన్నును పూర్తిగా ఎత్తివేశామని, మిగిలిన వాటిని ఐదు శాతానికి తగ్గించామని ఆయన చెప్పారు. అదే విధంగా పలు రకాల వస్తువులపై జీఎస్టీ శాతాన్ని భారీగా తగ్గించడం వల్ల ఖర్చులు తగ్గి, ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని ఎంపీ అభిప్రాయపడ్డారు. డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి మాట్లాడుతూ, జీఎస్టీ సంస్కరణల వల్ల కలిగే ప్రయోజనాలు, మందులపై తగ్గిన ధరల గురించి ప్రజలకు వివరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్, వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

తల్లి మందలించిందని యువతి ఆత్మహత్యాయత్నం

కొయ్యూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని మనస్తాపం చెందిన ఓ యువతి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మంప పంచాయతీ కించవానిపాలేనికి చెందిన ఆగూరి గౌరి(20) తల్లితో కలిసి ఉంటోంది. సోమవారం ఉదయం తల్లి మందలించడంతో మనస్తాపం చెంది కలుపు నివారణకు వినియోగించే మందు(గడ్డి మందు) తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గౌరిని తల్లి వెంటనే రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించింది. అక్కడ ప్రాథమిక వైద్య సేవల అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించింది. ప్రస్తుతం గౌరి ఆరోగ్యం మెరుగ్గానే ఉందని ఆమె కుటుంబీకులు తెలిపారు.

500 లీటర్ల నాటుసారా ధ్వంసం

» 5,500 లీటర్ల బెల్లం ఊట కూడా..
» ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ పోలీసుల సంయుక్త దాడులు


ఒడిశాలోని ఓండ్రొగడ్డలో నాటుసారా, బెల్లం ఊటను ధ్వంసం చేసిన ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ పోలీసులు

పెదబయలు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో భారీగా నాటుసారా, బెల్లం ఊట పట్టుబడిందని పాడేరు ఎక్సైజ్ సీఐ ఆచారి తెలిపారు. ఒడిశాలోని సరిహద్దు గ్రామాలైన ఓండ్రొగడ్డ, సూడుబీలలో నాటు సారా తయారు చేస్తున్నారని ముందస్తు సమాచారం రావడంతో సోమవారం ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి 500 లీటర్ల నాటుసారా, 5,500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారన్నారు. నిందితులను ఒడిశా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐలు హిరన్, లక్ష్మి, గణేశ్, వీర్రాజు, ఒడిశా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ రతి, ఎస్‌ఐ నైక్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గిరిజన యువకుడి మృతి


మర్రి సాగర్ (ఫైల్ ఫొటో)

చింతపల్లి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో చౌడుపల్లి బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గిరిజన యువకుడు మృతి చెందాడు. స్థానికులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మండలంలోని కుడుముసారి పంచాయతీ కోటగున్నలు గ్రామానికి చెందిన మర్రి సాగర్(21) చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై చింతపల్లి నుంచి స్వగ్రామం కోటగున్నలు గ్రామానికి బయలుదేరాడు. చౌడుపల్లి బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి వాహనం అదుపుతప్పి లోయలో పడిపోయింది. ప్రమాదానికి గురైన సాగర్‌ను స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

మెరుగు పేరిట మహిళకు టోకరా

» నిందితులను పట్టుకుని 24 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న క్రైమ్ పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కె.శ్రీనివాసరావు

గాజువాక, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలకు మెరుగుపట్టిస్తామని చెప్పి ఓ మహిళకు టోకరా వేసిన ఇద్దరు వ్యక్తులను గాజువాక క్రైమ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ కె.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది జూలై 15న రాజీవ్‌నగర్ సమీప ప్రశాంతినగర్ ప్రాంతానికి చెందిన ఓ ఇంటికి ఇద్దరు అపరిచిత వ్యక్తులు వచ్చి బంగారు ఆభరణాలకు మెరుగుపడతామని చెప్పి.. తమ వద్దనున్న కొన్ని నగలకు మెరుగు పెట్టి చూపించారు. దీంతో ఆ మహిళ తన వద్దనున్న 24 తులాల బంగారు ఆభరణాలను వారికి ఇచ్చింది. వాటిని వారు ఓ మట్టికుండలో ఉంచి ఏదో కెమికల్ ద్రావణం కలిపినట్టు నమ్మించి, ఆ కుండకు తెల్లని వస్త్రం చుట్టి ఇచ్చారు. పది రోజుల వరకు ఆ కుండను ఇంటి ఈశాన్య దిశలో ఎండ తగలని ప్రదేశంలో పెట్టి 11వ రోజున తెరవాలని సూచించి వెళ్లిపోయారు. 11వ రోజున ఆమె మట్టికుండను తెరవగా అందులో బంగారు ఆభరణాలు కనిపించలేదు. కేవలం కళ్లు ఉప్పు ఉండడంతో తాను మోసపోయానంటూ గతనెల 20న దువ్వాడ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీపీ శంఖబ్రత బాగ్చి, డీసీపీ (క్రైమ్) లతామాధురి, ఏసీపీ ఎ.నరసింహమూర్తి పర్యవేక్షణలో సీఐ శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా అన్నమయ్య జిల్లా పాతరాయచోటి ప్రాంతానికి చెందిన ఎం.రమణ (51), అనకాపల్లి జిల్లా మారేడుపూడికి చెందిన చప్పిడి నూకరాజు (31)లు ఈ నేరానికి పాల్పడినట్టు గుర్తించారు. వీరిని సోమవారం గాజువాక బస్టాప్ వద్ద పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 24 తులాల బంగారు ఆభరణాలు, రూ.5,300ను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

గంజాయి నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

» ఈగిల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ నాయక్


మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాలను వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ శివశంకర్ నాయక్

పాడేరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): గంజాయితో కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా ఈగిల్ టీమ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ నాయక్ సూచించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆశ కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన మాదక ద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మత్తు పదార్థాల వలన సమాజానికి జరుగుతున్న నష్టంపై మీరంతా అవగాహన ఏర్పరచుకోవడంతో పాటు ప్రజల్లోనూ అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే టోల్‌ఫ్రీ నంబర్ 1972కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524